24 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 259 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH


తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## తెలంగాణ టిజి ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

- 23నుంచి ఎప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం
- మే 12న తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష




# ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం



- మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు
- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టీటీడీ నిర్మాణాలకు 20 ఎకరాలు
- మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి23 వెలుతురు:**

హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే పక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన పక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై

# వికసిత బెంగాల్ బాధ్యత నాది

- ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు
- బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం
- బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 వెలుతురు:**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగ నున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది.

# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

- రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి
- దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం
- డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి



**వికారాబాద్,ఫిబ్రవరి23 వెలుతురు:**

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు,

# గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు లీగల్ సమస్యలు



- ప్రాజెక్ట్ ఆలస్యానికి అదే కారణం
- సచివాలయంలో సమీక్షించిన మంత్రులు ఉత్తమ్,పొన్నం

**హైదరాబాద్,ఫిబ్రవరి23 వెలుతురు:**

అనేక కారణాలు, లీగల్ సమస్యల వల్ల గౌరవెల్లి ప్రాజెక్టు..ఆలస్యం అవుతుందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేసేలా సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టు కోసం

# ఇండియా కూటమి నేతగా రాహుల్ తప్పుకోవాలి

- నాయకత్వాన్ని ప్రాంతీయ పార్టీలకు అప్పగించాలి
- కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు

**కోల్‌కతా,ఫిబ్రవరి23 వెలుతురు:**



కాంగ్రెస్ వెటరన్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి సొంత పార్టీపై విమర్శల దాడి చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. 'ఇండియా'

# సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం కృషి

- వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు
- సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు
- కల్తీపాల మృతుల కుటుంబాలకు పదిలక్షల ఎక్స్‌గ్రేషియా
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటన

**అమరావతి,ఫిబ్రవరి23( వెలుతురు):**

సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో సోమవారం సంక్షేమ బ్జడెట్ కేటాయింపులపై చర్చించారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని

# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన



- విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ
- జిఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం
- ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క

**హైదరాబాద్,ఫిబ్రవరి23 వెలుతురు:**

అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్

# బిజెపి ముఖ్య నేతలను హౌస్ అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి సర్కార్ సాగిస్తున్న నిర్బంధకాండకు నిదర్శనం

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:**



రెండు రోజులుగా నాతో పాటు బిజెపి ముఖ్య నేతలను హౌస్ అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి సర్కార్ సాగిస్తున్న నిర్బంధకాండకు నిదర్శనమని బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.. ఈ మేరకు సోమవారం రోజున పత్రికా ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డిలో కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని

## సీఎం గారు డూప్లికేట్ గాంధీ కుటుంబానికి రూ.వెయ్యి కోట్లు పంపాలనే శ్రద్ధే తప్ప

# మీకు ప్రజా సమస్యలు పట్టవా?



- మహిళలకు ప్రతినెలా రూ.2500లు ఇస్తామని చెప్పి రెండున్నరేళ్లు అయ్యింది ఆ డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదు?
- రాష్ట్ర మంత్రివర్గంలో డూప్లికేట్ గాంధీ కుటుంబానికి పంపాల్సిన రూ.వెయ్యి కోట్ల నిధుల సేకరణపైనే చర్చ జరుపుతున్నారా?
- అవ్వాతాతలకు ప్రతినెలా రూ.4 వేల ఆసరా పెన్షన్ ఇవ్వడంపై కేబినెట్ లో ఎన్నడైనా చర్చించారా?
- విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డును ఎందుకు ఇవ్వలేకపోతున్నామనే దానిపై మంత్రివర్గంలో చర్చించారా?
- నిరుద్యోగులకు ప్రతినెలా నిరుద్యోగ భ్రుతి ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ అమలుపై ఎన్నడైనా కేబినెట్ లో ప్రస్తావించారా?
- జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసిన రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెన్ ఫిట్స్ ను చెల్లించకపోవడంతో 61 మంది చనిపోయినా మీలో చలనం లేదా?
- ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5 డీఏలు, పెండింగ్ బకాయిలు అందక ఇబ్బంది పడుతున్నా మీకు పట్టదా?
- ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలివ్వకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు, వేలాది యాజమాన్యాలు అల్లాడుతున్న సంగతి మర్చిపోయారా?
- ఆరోగ్యశ్రీ బకాయిలివ్వకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందక అరిగోస పడుతున్న పేదల ఆరోగ్యం మీకు పట్టదా?
- డూప్లికేట్ గాంధీ కుటుంబానికి మూటలు పంపి పదవులు కాపాడుకోవాలనే తాపత్రయమే తప్ప 6 గ్యారంటీల అమలుపై ఎన్నడైనా చర్చించారా?
- మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలు సాధ్యాసాధ్యాలపై కేబినెట్ లో ఎందుకు చర్చించడం లేదు?
- కాంగ్రెస్ ఐదేళ్ల పాలనలో సగం పూర్తయినా ఇచ్చిన హామీల్లో 10 శాతం కూడా అమలు చేయనందుకు సిగ్గన్పించడం లేదా?
- అధికారం కాపాడుకోవాలనే యావే తప్ప తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమం మీకు పట్టదా?
- 6 గ్యారంటీలు, 420 హామీలను ఏ రోజు నుండి అమలు చేస్తారో? వాటికి ఎంత ఖర్చవుతుందో కేబినెట్ లో చర్చించి అమలు తేదీ ప్రకటించండి
- లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో 6 గ్యారంటీల అమలుపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం
- 6 గ్యారంటీలను అమలు చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి తీరుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:

వెలుతురు

## సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం కృషి

ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు. నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశిరచారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించిందని సీఎం చెప్పారు. రాజమహేంద్రవరం లోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. ఎనిమిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

## వికసిత బెంగాల్ బాధ్యత నాది

మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యవత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ టిజి ఎడ్‌సెట్ నోటిఫకేషన్ విడుదల

**హైదరాబాద్,ఫిబ్రవరి23 వెలుతురు:**

తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్టాత్మక టిజి ఎడ్‌సెట్-2026 నోటిఫికేషన్‌ను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కేయూ, దరఖాస్తుల ప్రక్రియ నుంచి ఫలితాల విడుదల వరకు పూర్తి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 23వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల సౌకర్యార్థం అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. రూ. 250 ఫైన్‌తో ఏప్రిల్ 23 వరకు, రూ. 500 ఫైన్‌తో ఏప్రిల్ 27 వరకు , రూ. 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నారు. ఇక పరీక్షా నిర్వహణ విషయానికి వస్తే, మే 12వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి ఉదయం , సాయంత్రం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయిన మూడు రోజుల్లోనే అంటే మే 15న అధికారులు ప్రాథమిక కీని విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించిన అనంతరం, మే 30వ తేదీన తుది ఫలితాలను వెల్లడించనున్నారు. బీఈడీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

అండ్ ఇండస్ట్రీ్రో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమిలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం

మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ది చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన ప్రక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జన గణన ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు ఈ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఈ హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశిరచిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమ రేటర్లను, వారికి దిశానిర్దేశర చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన ప్రక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన ప్రక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

## ఇండియా కూటమి నేతగా రాహుల్ తప్పుకోవాలి

కూటమి సారథ్య బాధ్యతల నుంచి రాహుల్‌గాంధీ తప్పుకోవాలని, ఆ బాధ్యతలను ప్రాంతీయ పార్టీల నేతలకు అప్పగించాలని కోల్‌కతాలో మీడియాతో మాట్లాడుతూ ఆయన సూచించారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, ఎంకే స్టాలిన్, తేజస్వి యాదవ్ వంటి సమర్థులైన నేతలు రాహుల్ గాంధీ నుంచి పగ్గాలు చేపట్టాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల పలు ఎన్నికల్లో వైఫల్యాలను చవిచూడడాన్ని అయ్యర్ ప్రస్తావిస్తూ, మమతా బెనర్జీని దూరం చేసుకోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడిందని అభిప్రాయపడ్డారు. మమతా బెనర్జీ లేకుంటే 'ఇండియా' కూటమి ఉనికికే ప్రమాదమని అన్నారు. కూటమి బాధ్యతలను తన చేతిలో పెట్టుకోకుండా ప్రాంతీయ పార్టీల నేతలైన స్టాలిన్, మమతా దీదీ, అఖిలేష్, తేజస్వి, ఇంకెవరికైనా రాహుల్ గాంధీ అప్పగిస్తారని ఆశిస్తున్నానని, వారయితే ఎక్కువ సమయం కేటాయించగలరని అయ్యర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపై మణిశంకర్ అయ్యర్ నిశిత విమర్శలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్న ఒక కార్యక్రమానికి అయ్యర్ హాజరయ్యారు. పినరయి విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనపై ప్రశంసలు కురిపించారు. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పినరయి విజయన్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. మణిశంకర్ అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదని, ఆయన వ్యాఖ్యలు, వ్యాసాలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని పేర్కొంది. కాగా, 'ఇండియా' కూటమి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ అయ్యర్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ వెంటనే స్పందించింది. రాహుల్ గాంధీ మాత్రమే ఇండియా కూటమిని సమర్థవంతంగా ముందుకు నడిపించగలరని, బీజేపీని ఎదుర్కొనగలిగే సత్తా రాహుల్‌కే ఉందని ఆ పార్టీ నేత ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. బెంగాల్ కాంగ్రెస్ నేతలు సైతం అయ్యర్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చాలాకాలంగా మణిశంకర్ అయ్యర్ దూరంగా ఉన్నారని, బెంగాల్ నుంచి ఐదు రాజ్యసభ సీట్లు ఖాళీగా ఉండటమే మణిశంకర్ అయ్యర్ తాజా వ్యాఖ్యలకు కారణం కావచ్చని బెంగాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుమన్ రాయ్ అన్నారు.

## బిజెపి ముఖ్య నేతలను హౌస్ అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి సర్కార్ సాగిస్తున్న నిర్భంధకాండకు నిదర్శనం

ఖూనీ చేసేలా వ్యవహరించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంపు ఆఫీసుపై దాడి చేయడం కాంగ్రెస్ సర్కార్ అరాచక పాలనకు అద్దం పడుతోంది.కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రతిపక్షాల గొంతు నొక్కడం, నియంతృత్వంగా వ్యవహరించడంలో బీఆర్ఎస్ సర్కారును తలపిస్తోంది. రేవంత్ ప్రభుత్వం ఇలాగే అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే కేసిఆర్ సర్కారుకు పట్టిన గతే వీరికి పడుతుంది.ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బిజెపి నేతలకు సమాధానం చెప్పడం చేతకాన్ని కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగడం, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. ఇది పాలన చేతకాని చవట, దద్దమ్మ సర్కార్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచామని విర్రవీగుతున్న కాంగ్రెస్ సర్కారుకు దమ్ముంటే మండల, జిల్లా పరిషత్ లకు ఎన్నికలు నిర్వహించాలి. రేపు జరిగే క్యాబినెటు మీటింగులో దీనిపై నిర్ణయం తీసుకోవాలి.క్యాబినెటు మీటింగులో నేతలు బడా కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లులు, వాటి కమిషన్లలో వాటాలు, పంపకాల గురించి తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించడంపై చర్చించకపోవడం దారుణం, దుర్మార్గం.క్యాబినెట్ మీటింగులో ప్రజాసమస్యలపై నిర్ణయాలు తీసుకోవాలని గతంలో కూడా నేను పలుసార్లు డిమాండ్ చేసాను. కానీ మంత్రుల్లోనే చలనం లేదు. ఎన్నిసార్లు చెప్పినా ఈ క్యాబినెటుకు దున్నపోతు మీద వానపడినట్టుగా ఉంటోంది. ప్రజాసమస్యల పరిష్కారంపై అసలు పట్టింపే లేదు. రేపటి క్యాబినెట్ మీటింగులో కూడా రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజనుకు ఇవ్వాల్సిన రైతు భరోసా డబ్బులు ఇవ్వడంపై నిర్ణయం తీసుకోవాలి. గతంలో ఇవ్వకుండా ఉన్న పెండింగులో ఉన్న బకాయిలను కూడా చెల్లించాలి.

ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు నుంచి రూ.తొమ్మిది వేల కోట్ల అప్పు తీసుకుందని మీడియాలో వచ్చింది. ఈ డబ్బు రైతు భరోసా కోసమే అని అన్నదాతలు భావించారు. కానీ డబ్బులు వచ్చి పది రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా చెల్లించకపోవడంతో ఈ డబ్బులను కూడా బడా కాంట్రాక్టర్లకే బిల్లుల చెల్లించడంలో భాగంగా ఇచ్చారనే అనుమానం కలుగుతోంది.ఎందుకంటే త్వరలో కేరళ, తమిళనాడు, అసోం, బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. మొన్న క్యాబినెట్ మంత్రులంతా ఢిల్లీకి వెళ్లినపుడు కాంగ్రెస్ హైకమాండ్ నేతలంగా తెలంగాణ పొటెన్షియల్ స్టేట్, ఫండింగ్ చేయాలని కోరినట్టు తెలిసింది. అందుకే కాంగ్రెస్ హైకమాండ్ కు కప్పం కట్టేందుకు రిజర్వ్ బ్యాంకు నుంచి తాజాగా అప్పు తీసుకున్న తొమ్మిది వేల కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించి, వారిచ్చే కమిషన్లను హైకమాండుకు పంపుతున్నట్టుగా ఉంది. రైతుభరోసాతో పాటు, వ్యవసాయ కూలీలకు ఇవ్వాల్సిన ఆత్మీయ భరోసా, సన్నరకం వరి ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్ బకాయిలు, విద్యార్థుల ఫీజు రీఎంబర్స్ మెంటు బకాయిలు, ప్రభుత్వ ఉద్యోగుల, రిటైర్డు ఎంప్లాయీస్ కు ఇవ్వాల్సిన రిటైర్మెంట్స్ బెనిఫిట్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలి. ఈ నిధులను విడుదల చేయడంపై రేపు జరిగే క్యాబినెట్ మీటింగులో నిర్ణయం తీసుకోవాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.81వేల కోట్లు అప్పులు చేసిందని మీడియాలో వార్తలు వచ్చాయి. 140 శాతం అప్పులు చేసిందని, ఇలా అయితే రాష్ట్రం ఆర్థిక సంక్షభంలో కూరుకుపోతుందని కాగ్ వంటి సంస్థలు, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా రేవంత్ సర్కార్ బారెడంత అప్పులు చేస్తోంది. కానీ, బెత్తెడంత కూడా అభివృద్ధి, సంక్షేమం చేయకపోవడం దారుణం అన్నారు


# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ÷ఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు లీగల్ సమస్యలు

తమ మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ మూడు జిల్లాల కలెక్టర్‌లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో లీగల్ ఇబ్బందులు ఎలా క్లియర్ చేయాలో చర్చించామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణ, పనుల వేగవంతంపై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించామన్నారు. భూసేకరణ విషయంలో హామీ ఇచ్చామని తెలిపారు. సంబంధిత నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఈ మేరకు బుధవారం నాడు సుప్రీంకోర్టులో ఈ ప్రాజెక్టు కేసు విచారణ ఉందని ప్రస్తావించారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఎన్విరాన్‌మెంట్ కేసు గెలుస్తామనే విశ్వాసం తమకుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలుగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి రావడానికి కావల్సిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# వివక్ష + నిర్లక్ష్యం = కేంద్ర బడ్జెట్!



**సాగర్ వనపర్తి,**
**పొలిటికల్ అనలిస్టు.**

*కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి మళ్ళీ నిరాశే మిగిలింది. రాజకీయాలకు అతీతంగా ఎన్నోసార్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. అయితే, ఈ నిర్లక్ష్యం పుష్కరకాలంగా కొనసాగుతున్నది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, మూసీ ప్రక్షాళన సహా కీలక ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు అన్యాయమే జరిగింది. వికసిత్ భారత్ లక్ష్యంగా రాష్ట్రం తెలంగాణ గ్లోబల్ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్ విడుదల చేసినా, అందుకు అనుగుణంగా నిధుల ఊసే లేకపోవడం తీవ్ర బాధాకరం. ఆరెంజ్ ఎకానమీలోనూ హైదరాబాద్‌ను చిన్న చూపు చూశారు. రీజినల్ మెడికల్ హబ్ అని బడ్జెట్‌లో ప్రస్తావించినా రాష్ట్రానికి చోటు లేకపోవడం తీవ్ర అభ్యంతరకరం.*

రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదన్న రాజ్యాంగ మూల సూత్రాన్నే కేంద్ర ప్రభుత్వం విస్మరించింది. జీడీపీలో ఐదు శాతానికి పైగా వాటా కలిగి ఉన్న తెలంగాణ, బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి సైతం రాకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. రాష్ట్రంలో ఎనిమిది ఎంపీలు గెలిచారు. ఈ సందర్భంలో తెలంగాణ రాష్ట్రం బీజేపీకి రాజకీయంగా చాలా ఇచ్చినందున, ఏదైనా నిధులు వస్తాయని ఆశిస్తేడ హక్కుగా వచ్చేవి కూడా ఇవ్వకపోవడం చూస్తేడ తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నిర్లక్ష్యం ఏంటో స్పష్టంగా అర్థం అవుతున్నది. రాష్ట్రం నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి కూడా నిధులు తేలేకపోవడమంటే వారి సమర్థత మీద ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. రాష్ట్ర విభజన హామీలకు ఎలాంటి కేటాయింపులు లేకుండా తీవ్రంగా నిరాశ పరిచింది. కేంద్రం తన పన్నుల్లో 50 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండు ఎప్పటి నుంచో ఉన్నది. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి చూపుతున్నది. ప్రధాని మోడీ చెప్పే కో-ఆపరేటివ్ ఫెడరలిజం మాటలకే పరిమితం అవుతున్నది. కేంద్ర బడ్జెట్ కర్షక, కార్మిక లోకానికి ఏమాత్రం ప్రయోజనకరంగా లేదు. బడ్జెట్‌లో కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకు పంచే వాటా కింద ఈసారి తెలంగాణకు 2.174 శాతం ఖరారైంది. దీని ప్రకారం 202627 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి మొత్తం రూ.33,180.78 కోట్లు రానున్నాయి. ఇందులో కార్పొరేషన్ పన్ను రూ.9,740.28 కోట్లు, ఆదాయపు పన్ను రూ.11,808.15 కోట్లు, కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) రూ.9,074.92 కోట్లు, కస్టమ్స్ సుంకం రూ.1,770.30 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.754.15 కోట్లు, ఇతర ట్యాక్స్‌లు రూ.32.98 కోట్లు ఉన్నాయి.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ 350 కి.మీల ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రూ.34,367.62 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ.45వేల కోట్లు, మెట్రో రైల్ కోసం రూ.44,028 కోట్లు, గోదావరి మూసీ అనుసంధానానికి రూ.6 వేల కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.17,212.69 కోట్లు, ఆంధ్రప్రదేశ్లోని బందర్ నుంచి హైదరాబాద్ వరకు డ్రై పోర్టు గ్రీన్‌ఫీల్డ్ హైవేకి రూ.17 వేల కోట్లు మంజూరు చేయాలని తెలంగాణ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కేంద్రానికి తెలంగాణ ఇస్తున్న మొత్తంలో కనీసం సగం కూడా రాష్ట్రానికి తిరిగి రావడం లేదు. దేశానికి అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణను ప్రోత్సాహించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో నిరక్ష్యం, వివక్ష చూపుతున్నది. ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీ వసూళ్లలోనూ తెలంగాణ సత్తా చాటుతూ గత ఐదేండ్లలో రూ.4.32 లక్షల కోట్లు (దేశంలో 3.87 శాతం) కేంద్రానికి చేరిస్తే, తిరిగి ఇవ్వడంలో కొర్రీలు పెడుతోంది. ఇటీవల లోక్ సభలో ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపిన గణంకాల ప్రకారం గత ఆరు సంవత్సరాలలో తెలంగాణ నుంచి రూ.4,35,920 కోట్లు వసూలైతే కేంద్రం రాష్ట్రానికి రూ.3,76,175.19 కోట్లే ఇచ్చింది. అంటే 86.29 శాతమే ఇస్తూ 13.71 శాతం కోత విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి తెలంగాణకు రూ.22,782 కోట్లు వస్తాయని అంచనా వేయగా 10 నెలల్లో రూ.4 వేల కోట్లు మాత్రమే రావడం ఆందోళనకరం. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధిపరుస్తూ ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే కేంద్రం సహకరించడం లేదు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంగా రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. రాష్ట్ర అభివృ ద్ధితోపాటు ప్రజా సంక్షేమం అందించేందుకు ఆర్థికంగా బలపడాల్సిన ఆవశ్యకత గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాలు రూపొందించింది. అందులో భాగంగా 2025 డిసెంబర్లో హైదరాబాద్ వేదికగా నిర్వహించిన 'గ్లోబల్ సమ్మిట్'తో పాటు 2024, 2025, 2026లో దావోస్ వేదికగా భారీగా పెట్టుబడులు సాధించి రాష్ట్ర ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పునాదులేస్తున్నా కేంద్రం సహకరించడం లేదు.




నూతన రాష్ట్రం తెలంగాణపై మోదీ ప్రభుత్వం మొదటి నుంచి వివక్ష చూపిస్తోంది. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన సంస్థలు, ప్రాజెక్టులు, నిధులు మంజూరు చేయడం లేదు. తెలంగాణ ఏర్పాటుపై పలుమార్లు అవమానకరమైన రీతిలో వ్యాఖ్యానించిన ప్రధాని మోదీ కక్ష తీర్చుకుంటున్నారా అన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తోంది. కేంద్రం తెలంగాణపైనే కాదు ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయ పక్షపాతంతో దేశ సమాఖ్య స్ఫూర్తికి తిలోదకాలు ఇస్తోంది. నిధుల కేటాయింపులో జనాభా ప్రాతిపదికన ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద పీటవేస్తూ, జనాభా నియంత్రణతో దేశ అభివృద్ధికి పాటుపడుతున్న దక్షిణాది రాష్ట్రాలకు మొండిచేయి చూపించడం దురదృష్టకరం. బీజేపీకి తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలున్నా రాష్ట్రానికి ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదు. రాష్ట్రం నుంచి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోరు. ప్రతి బడ్జెట్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర బీజేపీ నేతలు స్పందించరు. నిర్మాలా సీతారామన్ రూ.53,47,315 కోట్లతో ప్రవేశపెట్టిన 2026 27 బడ్జెట్ తెలంగాణనే కాదు యావత్ దేశ ప్రజలను తీవ్ర నిరాశపర్చింది. ఈ బడ్జెట్లో ప్రజల అవసరాలను తీర్చడంతోపాటు వారి సమస్యలు చక్కదిద్దే ప్రయత్నమే చేయలేదు. పార్లమెంట్లో బడ్జెట్ ప్రవేశపెట్టిన కొన్ని నిమిషాల్లోనే స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోవడమే బడ్జెట్ ఎంత పేలవంగా ఉందో చెప్పడానికి నిదర్శనం.

రాష్ట్రంలో విమానాశ్రయాల నిర్మాణాలను కేంద్రమం పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. బడ్జెట్ పై తెలంగాణ ప్రభుత్వం పెట్టుకున్న ఆశలను కేంద్రం అడియాసలు చేసింది. రాష్ట్రం కోరిన కీలక ప్రాజెక్టులకు కేటాయింపులు చేయకుండా రిక్తహస్తం చూపింది. ఆర్ఆర్ఆర్ రోడ్డు, మెట్రో రైలు, మూసీ ప్రాజెక్టు ఇలా వేటికీ నిధులు కేటాయించలేదు. బయో, ఫార్మారంగంలో, సెమీ కండక్టర్ పరిశ్రమలో తెలంగాణను విస్మరించారు. ప్రత్యేక సంస్కృతి, చారిత్రాత్మక ప్రాంతాలకు ప్రసిద్ధమైన తెలంగాణకు టూరిజం నిధులు కేటాయించలేదు. సింగరేణి గనులున్న తెలంగాణలో రేర్ ఎర్త్ ఖనిజాలపై దృష్టి పెట్టలేదు. రాష్ట్ర విభజన చట్టం హామీలైన బయ్యారం స్టీల్ ప్లాంట్, నవోదయ పాఠశాలలు, ఐఐఎం ఊసే ఎత్తలేదు. హైదరాబాద్ నుంచి పుణే, బెంగళూర్, చెన్నై నగరాల మధ్య హైస్పీడ్ కారిడార్లు ప్రకటించినా రాష్ట్రం కోరినట్టు కొత్త రైల్వే లైన్లను విస్మరించారు. దేశ ఆర్థికప్రగతికి తోడ్పడుతున్న తెలంగాణకు నిధులు పంపిణీలో అన్యాయం జరుగుతోంది. సంపద సృష్టిలో, పన్నుల వసూళ్లలో ముందున్న రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపుతోంది. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.01 శాతం. ఈ లెక్కన కేంద్రం నుంచి రూ.3.76 లక్షల కోట్లు దక్కాల్సి ఉన్నా, గడిచిన ఐదేండ్లలో రూ.1.84 లక్షల కోట్లు అంటే 2.45 శాతం మాత్రమే రావడంతో తెలంగాణ రూ.1.92 లక్షల కోట్లు నష్టపోయింది. ఇప్పటికైనా రివైజ్డ్ ఎస్టిమేషన్స్లో తెలంగాణ జరిగిన నష్టాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై ఉన్నది. లేనిపక్షంలో బీజేపోళ్ళ కథ ఏంటో కూడా తెలంగాణ ప్రజలు తేల్చుతారన్న విషయం మరువరాదు.

## కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు నిధులను కేటాయించకపోవడం శోచనీయం

**- టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:** తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ లో పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు నిధుల కేటాయింపులు జరుపకపోవడం శోచనీయమనీ టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందనీ, తెలంగాణ రాష్ట్రానికి పసుపు బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ కేంద్ర బడ్జెట్లో పసుపు బోర్డుకు నిధుల కేటాయింపుపై ఏమాత్రం స్పష్టత లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి అధికంగా పన్ను చెల్లిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో పూర్తిగా మొండి చెయ్యి చూపిందన్నారు . పసుపు బోర్డు ప్రారంభోత్సవం సందర్భంగా రూ.10 వేల కోట్ల ఎగుమతులకు అవకాశాలు కల్పిస్తామని స్వయంగా కేంద్ర మంత్రి వెల్లడించినప్పటికీ, ఆ దిశగా చర్యలు శూన్యమని, ఈ ఏడాదిలో కేంద్ర బడ్జెట్లో పసుపు బోర్డుకు నిధులను కేటాయించకపోవడం విచారకరమని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు.

## అనంతగిరిలో డీసీసీ ట్రైనింగ్ క్యాంపు, పార్టీ బలోపేతంపై నేతల చర్చ

**వెలుతురు వికారాబాద్, అనంతగిరి ఫిబ్రవరి 23:**



రాష్ట్ర కాంగ్రెస్ రథసారథి శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి శర్మిల రెడ్డి గారితో కలిసి డీసీసీ ట్రైనింగ్ క్యాంపులో ఇష్టాగోష్టిగా సమావేశమయ్యారు. ట్రైనింగ్ క్యాంపు తొలి రోజు కార్యక్రమాలపై వారు సమీక్ష నిర్వహించారు. మిగిలిన తొమ్మిది రోజుల శిక్షణ కార్యక్రమాల అమలు విధానంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారు రాష్ట్ర పీసీసీ అధ్యక్షులతో విస్తృతంగా చర్చించారు. శిబిరం ద్వారా పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపి, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

## నేడే భాగ్యలక్ష్మీ ఆలయానికి కరీంనగర్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు రాక

**- ఆయా కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి పాతబస్తీలో పర్యటించనున్న బండి సంజయ్, రామచంద్రరావు**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు నేడు (మంగళవారం) పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ ఆలయాన్ని దర్శించుకోనున్నారు. నేడు ఉదయం 10 గంటలకు వీరంతా హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వస్తారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు వీరితో కలిసి పార్టీ కార్యాలయంలో అల్పాహార విందు ఇస్తారు. అనంతరం ఆయా కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఉదయం 11 గంటలకు పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంటారు. ఆయా కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి బండి సంజయ్, రామచంద్రరావు భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుండి మధ్యాహ్నం 12 గంటలకు లాల్ దర్వాజ మహంకాళి టెంపుల్ కు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు లాల్ దర్వాజలోని రాజన్న బౌలి రెడ్డి జన సంఘం ఫంక్షన్ హాలులో ఆయా కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, బీజేపీ స్థానిక నాయకులతో కలిసి భోజనం చేస్తారు.

# మహిళలపై నేరాల విషయంలో ప్రధాని మోదీ మౌనం సిగ్గుచేటు

## - అల్కా లాంబా ప్రశ్నలకు వెంటనే సమాధానం చెప్పాలి



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:** దేశంలోని మహిళలపై జరుగుతున్న దారుణమైన నేరాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ గారి నిరంతర మౌనం తీవ్రంగా ఖండించదగ్గదని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి గారు మండిపడ్డారు.

అంకిత భండారి హత్య కేసు, ప్రజ్వల్ రేవన్న లైంగిక దాడుల కేసు, అలాగే వివిధ రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన నాయకులపై వెలుగులోకి వచ్చిన మహిళలపై దారుణ ఘటనల విషయంలో ప్రధాని మోదీ గారు ఎందుకు నోరు మెదపడం లేదని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి అల్కా లాంబా గారు లేవనెత్తిన ప్రశ్నలు దేశ ప్రజల మనస్సాక్షిని కదిలిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

"మహిళల గౌరవం, భద్రత గురించి ఎన్నికల సమయంలో పెద్ద పెద్ద మాటలు చెప్పిన ప్రధాని గారు, ఇప్పుడు మహిళలు న్యాయం కోసం అరుస్తున్నప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు? నేరస్తులు బీజేపీకి చెందినవారైతే చట్టం మౌనం వహించాలా? బాధిత మహిళలకు ప్రధాని గారి నుండి ఒక మాట కూడా రావడం లేదా?" అని అల్కా లాంబా గారు ధైర్యంగా, నేరుగా ప్రశ్నించడం ప్రతి భారత మహిళ యొక్క ఆవేదనను ప్రతిబింబిస్తోందని డా. రేఖ బోయలపల్లి గారు అన్నారు. ప్రధాని మోదీ గారి ఈ మౌనం కేవలం బాధ్యతారాహిత్యం మాత్రమే కాకుండా, మహిళల భద్రతపై ఆయన ప్రభుత్వ అసలు వైఖరిని బయటపెడుతోందని ఆమె తీవ్రంగా విమర్శించారు.

అల్కా లాంబా గారి ధైర్యవంతమైన, రాజీ పడని నాయకత్వం దేశవ్యాప్తంగా వేలాది మహిళలకు ధైర్యం నింపుతోందని, మహిళల గౌరవం కోసం పోరాటానికి కొత్త శక్తిని అందిస్తోందని ఆమె తెలిపారు.

దేశంలోని మహిళలు ఇక మౌనం వహించబోవడం లేదని, వారి గౌరవాన్ని కాపాడటంలో విఫలమయ్యే ప్రతి నాయకుడిని ప్రశ్నిస్తారని డా. రేఖ బోయలపల్లి గారు హెచ్చరించారు.

తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్, మహిళల గౌరవం కోసం, న్యాయం కోసం, మరియు బాధ్యత కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.



**డా. రేఖ బోయలపల్లి**
ఉపాధ్యక్షురాలు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్



## ఆంధ్రతెలంగాణ డీసీసీ అధ్యక్షుల పదిరోజుల శిక్షణ శిబిరానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వెలుతురు వికారాబాద్, అనంతగిరి ఫిబ్రవరి 23:** వికారాబాద్ జిల్లా అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో జరుగుతున్న ఆంధ్రతెలంగాణ డీసీసీ అధ్యక్షుల పదిరోజుల శిక్షణ శిబిరానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ శర్మ ముఖ్యమంత్రికి స్వాగతం పలికి శిబిర విశేషాలు పదిరోజుల కార్యక్రమ షెడ్యూల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి శర్మిలా రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దెల శ్రీధర్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, పున్నం ప్రభాకర్ మరియు ఏఐసీసీ నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. సిడబ్ల్యూ సభ్యులు వంశీ చందర్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ శ్రీ సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుల నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించడం, కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి వరకు బలోపేతం చేయడం లక్ష్యంగా శిక్షణ తరగతులు, సేవా కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస సెషన్లు నిర్వహిస్తున్నారు. 1920లో ప్రారంభమైన సేవాదళ్ శిబిరాల సంప్రదాయంలో భాగంగా ఈ శిబిరం నిర్వహించడం ఆనందకరమని శ్రీ ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు

# బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్‌ని కలిసిన విక్రమ్ గౌడ్ బృందం

**- నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటనలో నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలి**

**- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులను కలిసిన బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా,**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:** కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో రజక సామాజిక వర్గానికి చెందిన గణేష్, దళిత సామాజిక వర్గానికి చెందిన చంద్రకళ, మౌనికలపై కుల అహంకారంతో సర్పంచ్ తుకామ్ తుకారాం రెడ్డి, సతీష్ రెడ్డి మధుసూదన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర సభ్యులతో కలిసి ఇష్టానుసారంగా మహిళలను కొట్టి తాకరాని చోట తాకి రెండు నెలల పసికందు అని కూడా చూడకుండా అమానుషంగా చంపేసిన ఇలాంటి నరరూప రాక్షసులను వరి తీయాలని కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు అగ్రకుల అహంకారంతో బీసీ దళిత కుటుంబానికి చెందిన వారిపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వాళ్లపై హత్యకేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు నమోదు చేయాలి రాష్ట్రంలో కుల దురంకార హత్యలు జరగకుండా బీసీ ఎస్సీ ఎస్టీలపై భౌతిక దాడులు భవిష్యత్తులో జరగకుండా నివారించాలంటే కుమ్మెర నిందితుల ను కఠినంగా శిక్షించాలి బాధిత కుటుంబమైన గణేష్, చంద్రకళ లకు ప్రభుత్వపరంగా పది లక్షలు రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించాలి కుమ్మెర కేసు ఘటనలో సంబంధం ఉన్న అందరినీ ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు తలగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలి బాధితుల కుటుంబానికి న్యాయం చేస్తామని అండగా ఉంటామని బీసీ కమిషన్ హామీ ఇచ్చారు బీసీ రజక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు పోరాడుతుందని తెలిపారు కార్యక్రమంలో బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగం, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.....

# సంపాదకీయం..

# మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలి !

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అడపాదడపా గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను పట్టుకుంటున్నా..అదేమంత పెద్ద మొత్తంలో కాదని తెలుస్తోంది. చాపకింద నీరులా ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరిస్తోంది. రోజూ ఎక్కడోచోట దాడుల్లో మత్తు పదార్థాలను పట్టుకుంటూనే ఉన్నారు. అయినా రవాణా ఆగడం లేదు. దొరికిన వారిని ఎన్‌కౌంటర్ చేస్తే తప్ప రవాణా ఆగదేమో అన్న ఆందోళన కలుగుతోంది. నిరుద్యోగులు దీనిని ఓ ఉపాధిగా ఎంచుకోవడం వల్లనే రవాణా సులభంగా మారింది. దీనికితోడు దీంతో డబ్బులు కూడా బాగా రావడంతో యువత దీనిని ఉపాధిగా ఎంచుకుని ఈ ఉచ్చులో దిగుతున్నారు. దీనికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టాల్సి ఉంది. యువత పెడమార్గం పట్టకుండా వారికి ఉపాధి చూపాలి. స్కూలుస్థాయిలోనే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. కాలేజీల్లో నిఘా పెంచాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా పరిస్థితికి అడ్డుకట్ట పడడం లేదు. ముఖ్యంగా యువత మత్తుకు అలవాటు పడి దుర్మర్గాలకు దిగుతున్నారు. మత్తు మనిషిలోని విచక్షణను హరించి వేస్తోంది. ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో చెప్పటానికి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఇటీవల జరిగిన బాలిక హత్యాచార దుర్మార్గం ఓ హెచ్చరిక కావాలి. ఇదొక్కటే కాదు ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నాయి. మత్తులో ఓ మైనార్ బాలికను కొందరు సామూహిక అత్యాచచరం చేసారు. అభంశుభం తెలియని



పసిపాపను చిదిమేసిన ఘటనలో కులవర్ధన్ అనే దుర్మార్గుడు ఆత్మహత్ చేసుకున్నా సంతోషించడానికి లేదు. నెల్లూరు నగరంలో పట్టపగలే అందరూ చూస్తుండగానే- పెంచలయ్య అనే ప్రజాకళాకారుడిని గంజాయి మూక పొట్టన పెట్టుకొంది. నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యను ఈ ఏడాది జనవరిలో మత్తు మాఫియా కారుతో గుద్ది, ప్రాణాలు బలిగొంది. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న దారుణ ఉదంతాలు తరచూ చూస్తూనే ఉన్నాం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అంటకాగుతూ ఈ ముఠాలు తమ దౌర్జన్యాలను చెలాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. పైపై చర్యలతో ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోదని గ్రహించాలి. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఖచ్చితమైన కార్యాచరణ రూపొందించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో సంబంధం ఉన్న ముఠాలను పార్టీల నుంచి వెలివేయాలి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న గంజాయి సామ్రాజ్యాన్ని సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఒంటరిపాటు చేసినప్పుడే ? దాని నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుంది. ఈ ఘటన యువతలో మార్పు తీసుకుని వస్తుందని అనుకోవడం భ్రమే అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాల విచ్చలవిడి వినియోగం ఆందోళన కలిగించేలా ఉంది. దాని నియంత్రణకు,నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. ఉభయ తెలుగు రాస్ట్రాల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసపెట్టి ఈ తరహా దారుణాలు జరుగు తున్నందుకు కఠిన చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు. వరుసగా జరుగుతున్న చాలా నేరాల వెనుక మత్తు, మాదకద్రవ్యాలు విపరీతంగా పనిచేస్తున్నాయని ప్రభుత్వాలు గుర్తించాలి. నిందితుల ప్రాణాలు తీసేస్తోనో, జైల్లో వేస్తోనే, లేదా వారే తీసుకుంటేనో ఈ సమస్యకు పరిష్కారం దక్కదు. విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల రవాణాను సవాల్‌గా తీసుకోవాలి. కూకటివేళ్లతో సహా పెకలించాలి. దానికి నిరంతరమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ప్రభుత్వాలు నిచేయాలి. అవసరమైతే ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పన్నెండేళ్ల వయసు పిల్లలు మొదలుకొని యువకుల వరకూ ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను వృథం చేసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. మత్తు బానిసలను ఆ ఊబి నుంచి బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ.15 వేల కోట్ల ఖర్చవుతుందని ఒక అంచనా. చికిత్సకు వెళ్లకుండానే కొందరు మత్తులనే కుప్పకూలి పోతున్నవారు దేశంలో 2003 - 2013 మధ్య పోలీసు తనిఖీల్లో రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడితే- తరువాతి పదేళ్ల కాలంలో అంటే 2014 - 2025 మధ్య కాలంలో రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు దొరికాయి. విచ్చలవిడిగా పెరుగుతున్న మత్తు ద్రవ్యాల వినియోగానికి ఈ గణాంకాలు ఒక ఉదాహరణ. దొరికిన మాదకద్రవ్యాలే ఇంత పెద్దఎత్తున ఉంటే దేశమంతా విస్తరించి వినియోగమైనది ఎంత ఉంటుందో ఊహించవొచ్చు! మాదకద్రవ్య వినియోగం తొలుత సరదాగా మొదలై, ఉత్తేజం ఇస్తున్నట్టుగా అనిపించి, తరువాత మనిషి సర్వ శారీరక వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుంది. మత్తుకు బానిసయ్యేలా మార్చేసి, విచక్షణను, వివేచనను చంపేస్తుంది. సామాజిక కట్టుబాట్లను, నాగరిక విలువలను కాలదన్ని, మనిషిని మృగంలా మార్చేస్తుంది. ఫలితంగా తీవ్రమైన నేరాలూ, దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మాదకద్రవ్యాల కారణంగా ఎన్నో కుటుంబాలు అస్తవ్యస్త మవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియాన్స్ వీసా గడవువ ముగిసినా ఇక్డే తిష్టవేసి మత్తు వ్యాపారం చేస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించాలి. మత్తు పదార్థాల రవాణను అరికట్టేందుకు ఆపరేషన్ చేపట్టాల్సిందే. ఇందుకోసం పెద్ద ఎత్తున బలగాలను వినియోగించాలి. యువతను కాపాడుకోవడానికి ఎంత కఠినమైన చర్యలకైనా వెనకాడరాదు.



## కులం చిదిమేసింది..

నవమాసాలు మోసి
ఎన్నో ఆశలతో
బిడ్డ కోసం
ప్రసవ వేదనను
**పంటికింద నొక్కిపట్టి**

భరించిన కష్టం విలువ తెలియని
నీచ రాజకీయుల
**కులగజ్జికి స్వస్థి పలకాల్సిందే..!**

ఓట్లడిగే రోజు లేని కులం..
**దేవుడి రూపంలో ఎందుకొచ్చింది..?**

నాలుక మడిచిన నాయకులకు
కన్నతల్లి గోష కనిపిస్తలేదా..?
మా బీసీలు.. మా ఓట్లు..
**రాజ్యాధికారం కోసమేనా..?**

రాడేం ఎవ్వడు..కులం కోసం..!
**నిలబడిన బడుగులకు నీరాజనం..**

తక్కువ కులమన్నోళ్ళీ
తూర్పాల పట్టాలి..
అహంకారాన్ని అంధకారం చేయాలి..
ఒక్కటవ్వాలి నువ్వు నేను..
లేదింకా ఏ కులానికి అడ్డుకట్ట..
గొంతుమీద కాలు పెట్టిన..
**కసాయికి కావరమరగాలి..!**

పసిగుడ్డుపై పైశాశికత్వానికి
ఫలితమివ్వాలి..
**కులదూషణకు నీ తెగింపే సమాధానమవ్వాలి.**

మూగబోయిన అమ్మకు..
ఇదే నా నివాళు..

**రాహుల్ కశ్యప్**
9951184676

## వందవరోజుకు చేరిన ఆదోని జిల్లా ఆందోళన

**ఆదోని,ఫిబ్రవరి23( వెలుతురు):**
ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదోని పట్టణంలో ఐక్య ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నారు. ఈ దీక్షలు సోమవారం 100వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐక్య ఆధ్వర్యంలో నాయకులు ప్రజాసంఘాలు వివిధ పార్టీల నాయకులు ప్రజలు కలిసి కుంబాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 100 మంది సీపీఐ నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆదోని జిల్లా సాధించేంతవరకు ఈ ఉద్యమం ఆగదని నాయకులు పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన ఆలోచన చేసిన ప్రభుత్వం ఆదోనిని విస్మరించిందని మండిపడ్డారు. అతిపెద్ మార్కెట్ కేంద్రంగా, వ్యాపార కేంద్రంగా ఉన్న ఆదోనిని విస్మరించడం తగదన్నారు.

# “రేపటి చరిత్ర ఎవరిది? జైళ్లలో ఉన్నవారిదా, స్టూడియోలలో మాట్లాడే కుహనా మేధావులదా?”



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడేటప్పుడు ముందుగా ఒక నిజాన్ని ఒప్పుకోవాల్సిందే. ఇది ఎవరో కొద్ది మంది నాయకుల తెలివితేటల ఫలితంగా పుట్టిన ఉద్యమం కాదు. ఇది ఎవరో పది మంది మేధావులు కూర్చొని సిద్ధాంతంగా రూపకల్పన చేసిన ఉద్యమం కాదు. ఇది కోట్లాది ప్రజల గుండెల్లో దశాబ్దాల తరబడి పేరుకుపోయిన అవమానాల, అన్యాయాల, దోపిడీ అనుభవాల సమిష్టి విస్ఫోటనం. నీళ్ల కోసం మాత్రమే కాదు, నిధుల కోసం మాత్రమే కాదు, ఉద్యోగాల కోసం మాత్రమే కాదుతమను తాము రెండో తరగతి పౌరులుగా చూసిన పాలనా వ్యవస్థపై జరిగిన తిరుగుబాటు.*

ఈ ఉద్యమం గ్రామాల గుండెల్లో పుట్టింది. పొలాల్లో చెమట కార్చిన రైతు నిట్టూర్పులో పుట్టింది. నిరుద్యోగిగా ఊరిలో తిరుగుతున్న యువకుడి ఆవేదనలో పుట్టింది. పాఠశాలలో, కళాశాలలో “మీది వెనుకబడిన ప్రాంతం” అని తక్కువగా మాట్లాడిన మాటల్లో పుట్టింది. తమ భూముల మీద హక్కులు కోల్పోయిన గిరిజనుల మౌన ఆర్తనాదంలో పుట్టింది. తెలంగాణ అనేది ఒక మ్యాప్ కాదు, ఒక రాజకీయ డిమాండ్ మాత్రమే కాదుఅది ఒక అనుభూతి, ఒక ఆత్మగౌరవ పోరాటం.

ఈ సత్యం తెలిసినప్పటికీ, తెలిసినట్టు నటించకుండా, తెలిసినదాన్ని వక్రీకరించి, చరిత్రను తమకు అనుకూలంగా మలచాలనుకునే ప్రయత్నమే ఈ రోజున తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద మేధో మోసం. ఉద్యమాన్ని ప్రజల నుంచి వేరు చేసి, దాన్ని కొందరి వ్యక్తిగత ప్రతిభగా చూపించాలన్న ప్రయత్నం అనేది ఉద్యమ ఆత్మను ఖండించడమే. కోట్ల మంది త్యాగాలను, వేల మంది బలిదానాలను, లక్షల మంది పోరాటాలను తక్కువ చేసి చూపించడమే.


తెలంగాణ ఉద్యమం ఎప్పుడూ ఒక్క నాయకుడి మోనోపోలీ కాదు. అది విద్యార్థి, ఉద్యోగి, రైతు, కూలీఅందరి కలిసిన శక్తి. ఉద్యమ కాలంలో నాయకత్వం మారుతూ వచ్చింది, రూపాలు మారాయి, వ్యూహాలు మారాయి. కానీ మూలకారణం ఒక్కటేఅసమానత. ఆ అసమానతపై తిరుగుబాటు.

ఇప్పుడు ప్రమాదం ఏంటంటేఉద్యమాన్ని ఒక చరిత్ర పుస్తకంలోని అధ్యాయంగా మార్చేయడం. ప్రజల సమస్యలు ఇంకా అలాగే ఉన్నా, ఉద్యమాన్ని పూర్తయిన కథలా చెప్పడం. ఇదే మేధో ద్రోహం. తెలంగాణ వచ్చిందంటే చాలు అన్న భావన కాదు, తెలంగాణ ఎందుకు వచ్చిందో మర్చిపోవడమే అసలైన ప్రమాదం.

కాబట్టి తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసుకోవడం అంటే జెండాలు ఎగరవేయడం కాదు, ప్రసంగాలు చేయడం కాదు. ఆ ఉద్యమానికి కారణమైన పరిస్థితులు, అసమానతలు, అవమానాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయా లేదా అని ప్రశ్నించుకోవడమే నిజమైన గౌరవం. ప్రజల ఉద్యమాన్ని ప్రజల దగ్గరే ఉంచడంఅదే తెలంగాణ ఉద్యమానికి న్యాయం.

ఈ సత్యం తెలిసినప్పటికీ, తెలిసినట్టు నటించకుండా, తెలిసినదాన్ని వక్రీకరించి, చరిత్రను తమకు అనుకూలంగా మలచాలనుకునే ప్రయత్నమే ఈ రోజున తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద మేధో మోసం.తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న రోజుల్లో, ప్రమాదం ఉన్న ప్రతి చోట అడుగు వెనక్కి వేసిన కొంతమంది, ఈ రోజు మాత్రం టీవీ స్టూడియోలలో కూర్చొని ఉద్యమానికి వ్యాఖ్యాతలుగా, న్యాయనిర్ణేతలుగా, యజమానులుగా మారడం ఒక సాధారణ వ్యంగ్యం కాదుఇది ఒక ఘోరమైన నైతిక పతనం. ఉద్యమం నడుస్తున్నప్పుడు మౌనం, ఉద్యమం విజయం సాధించిన తర్వాత మేధావితనంఇదే కుహనా మేధావుల అసలైన స్వభావం. వారు అప్పట్లో ఉద్యమంలో లేరు. ఉద్యమం ప్రమాదకరంగా ఉన్నప్పుడు తటస్థతనే భద్రతగా భావించారు. కానీ ఉద్యమం గెలిచిన తర్వాత మాత్రం ‘మేమే ముందుండాం’, ‘మేమే దారి చూపించాం’, ‘మేమే మేధస్సు ఇచ్చాం’ అనే ధైర్యం వారిలో పుట్టుకొచ్చింది.ఉద్యమం కాలంలో రోడ్ల మీద లాఠీలు పడుతున్నప్పుడు, విద్యార్థులపై కేసులు నమోదవుతున్నప్పుడు, యువకులు జైళ్లకు తరలించబడుతున్నప్పుడుఈ మేధావులు ఎక్కడున్నారు? వారి గొంతులు ఎందుకు వినిపించలేదు? ఉద్యమం ప్రమాదంగా మారిన ప్రతి క్షణం వీరు ఎక్కడ దాక్కున్నారు? ఉద్యమం తీవ్రమైనంతకాలం భద్రత, మౌనం, అవకాశవాదంఉద్యమం ఫలితం వచ్చాక మాత్రం చరిత్ర పాఠాలు. ఇది మేధావితనం కాదు. ఇది శుద్ధమైన అవకాశవాదం.తెలంగాణ ఉద్యమం ఒక సిద్ధాంత ఉపన్యాసం కాదు. అది పుస్తకాలలో చదివి వేదికలపై చెప్పే విషయం కాదు. అది ఒక జీవితం. ఒక త్యాగం. ఒక నిరంతర పోరాటం. ఆ పోరాటం అంటే ఉద్యోగాలు పోవడం, చదువులు మధ్యలో ఆగిపోవడం, కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం, నెలల తరబడి జైళ్లలో ఉండడం. ఈ అనుభవం లేని వారు ఉద్యమానికి సర్టిఫికెట్లు ఇవ్వడం ఎంతవరకు న్యాయం? ఉద్యమం చేసిన వారు జైళ్లలో ఉంటే, ఉద్యమంపై మాట్లాడిన వారు మాత్రం ఏసీ గదుల్లో కూర్చుని నాలుగు సిద్ధాంత వాక్యాలు పలికారు. ఇది ద్వంద్వ వైఖరి కాకపోతే ఇంకేమిటి?

కొంతమంది ఉద్యమానికి అడ్వకేట్‌లా నటించారు. బయటకు ఉద్యమానికి మద్దతు, లోపల అధికార వ్యవస్థతో సఖ్యత. ఉద్యమం బలంగా ఉన్నప్పుడు స్పష్టమైన వైఖరి లేదు. కానీ ఉద్యమం తీవ్రత పెరిగినప్పుడు, కేసులు పడినప్పుడు, లాఠీచార్జ్ జరిగినప్పుడు, కాల్పులు జరిగినప్పుడువీరి నైతికత ఎక్కడ దాక్కుంది? అప్పట్లో ఒక స్పష్టమైన వైఖరి తీసుకునే ధైర్యం లేని వారు, ఈ రోజు ఉద్యమంపై తీర్పులు చెప్పడం తెలంగాణ సమాజం సహించాల్సిన అవసరం లేదు. నిజమైన ఉద్యమకారులు తమ గురించి తామే గొప్పగా చెప్పుకోరు. వారు మాట్లాడరు, వారి గాయాలు మాట్లాడతాయి. వారి కేసుల ఫైళ్ళు మాట్లాడతాయి. వారి జైలు అనుభవాలు మాట్లాడతాయి. వారి కుటుంబాల కష్టాలు మాట్లాడతాయి. కానీ ఈరోజు గాయాలు లేని వారు, త్యాగం చేయని వారు ఉద్యమానికి యజమానులుగా మారిపోయారు. ఉద్యమం చేసిన వారి పేర్లు చరిత్రలో ఉంటే, ఉద్యమాన్ని అమ్ముకున్న



వారి ముఖాలు టీవీ స్క్రీన్లలో మెరుస్తున్నాయి. ఇదే ఈ కాలం యొక్క కఠిన వాస్తవం.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మొదలైన ‘మేమే’ రాజకీయాలు ఉద్యమానికి చేసిన అతి పెద్ద ద్రోహం. మూడు కోట్ల మంది పోరాడిన ఉద్యమాన్ని కొద్ది మంది తమ వ్యక్తిగత బ్రాండ్‌లా మార్చుకోవడం చరిత్రను దోచుకోవడమే. ఉద్యమం ఒక సామూహిక వారసత్వం. అది ఒక తరం సంపాదించిన ఘనత కాదు, తరతరాలు మోసుకొచ్చిన బాధల ఫలితం. అలాంటి ఉద్యమాన్ని వ్యక్తిగత ఆస్తిగా ప్రకటించే హక్కు ఎవరికీ లేదు.ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటేఆంధ్ర ఆధిపత్య రాజకీయాల్లో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉండి ఉద్యమాన్ని అణిచివేయడానికి పనిచేసిన కొందరు కూడా ఈ రోజు ఉద్యమకారులుగా మాట్లాడటం. ఆనాడు తెలంగాణపై లాఠీచార్జ్ జరిగినప్పుడు, ఉద్యమకారులపై కేసులు పెట్టినప్పుడు వీరి మౌనం తెలంగాణ ప్రజలకు గుర్తుంది. ఉద్యమాన్ని అణిచే నిర్ణయాలకు మద్దతిచ్చిన చరిత్ర కూడా ప్రజల జ్ఞాపకాల్లో ఉంది. ఈ చరిత్రను చెరిపేయాలని ప్రయత్నించడం ప్రజలను అవమానించడమే. మీడియా పాత్ర కూడా ఈ సందర్భంలో తీవ్రమైన విమర్శకు లోబడి ఉండాలి. ఉద్యమం ఒక వ్యాపారంగా మారిపోయింది. టీఆర్పీల కోసం ఉద్యమ భావోద్వేగాలను అమ్ముకున్నారు. ఉద్యమంలో లేని వారు ఉద్యమాన్ని మార్కెట్‌లో పెట్టారు. చర్చల పేరుతో చరిత్రను వక్రీకరించారు. నిజమైన ఉద్యమకారులను పక్కనబెట్టి, కుహనా మేధావులకు వేదికలు కల్పించారు. ఇది జర్నలిజం కాదుఇది చరిత్రను అమ్ముకోవడం. తెలంగాణ ఉద్యమం ఒక తరగతి గది నుంచి మరో తరగతి గదికి పరిమితం కాలేదు. అది పల్లెల్లో మొదలైంది. పొలాల్లో పనిచేసే రైతుల దగ్గర నుంచి, బస్టాండ్లలో కూర్చునే కూలీల దగ్గర నుంచి, యూనివర్సిటీల్లో చదువుకునే విద్యార్థుల దగ్గర నుంచిఅందరి గుండెల్లోకి వెళ్లింది. పాఠశాలల్లో తెలంగాణ పాటలు పాడిన పిల్లలు కూడా ఉద్యమంలో భాగమే. మహిళలు తమ భర్తలను, పిల్లలను ఉద్యమానికి పంపారు. రైతులు పంటలు వదిలేశారు. ఉద్యోగులు విధులు మరిచారు. ఇవన్నీ ఎవరి ఆదేశంతో కాదుప్రజల అంతరంగిక స్పందనతో.ఈ ప్రజలే ఉద్యమకారులు. ఈ సత్యాన్ని అంగీకరించకుండా, కొద్ది మంది మాత్రమే ఉద్యమకారులమని చెప్పుకోవడం ఒక మేధో దౌర్జన్యం. ఉద్యమాన్ని వ్యక్తిగత చరిత్రగా మార్చుకునే ప్రయత్నం ఇది. తెలంగాణ ఉద్యమం ఒక కుటుంబం కాదు, ఒక కులం కాదు, ఒక పార్టీ కాదుఇది ఒక ప్రజా ఉద్యమం.ఈ రోజు నిజమైన ఉద్యమకారులను అవమానించే స్థాయికి దిగజారడం అత్యంత నీచమైన పరిణామం. ఉద్యమంలో పాల్గొనని వారు, ఉద్యమం అంటే ఏమిటో అనుభవించని వారునిజంగా త్యాగాలు చేసిన వారిపై ఆరోపణలు చేయడం కేవలం వ్యక్తిగత అహంకారమే కాదు, నైతిక పతనానికి స్పష్టమైన నిదర్శనం. ఉద్యమం అనేది టీవీ స్టూడియోలో మాట్లాడటం కాదు, యూట్యూబ్ ఛానల్‌లో కూర్చుని కథలు చెప్పడం కాదు. అది రోడ్లపై నడిచిన పోరాటం, జైలుల్లో గడిపిన రోజులు, ఉద్యోగాలుజీవితాలు త్యాగం చేసిన చరిత్ర.

అమ్ముడుపోయిన వారు, అవకాశవాదులు, ద్వంద్వ వైఖరులుఇవే కుహనా మేధావుల అసలైన లక్షణాలు. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో కూర్చుని తెలంగాణ ఉద్యమంపై విషం చిమ్మిన కొందరు టీవీ జర్నలిస్టులు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త యూట్యూబ్ ఛానళ్లతో “ఉద్యమ వారసులు”గా మారడం ప్రజల బుద్ధిని తక్కువ అంచనా వేయడమే. ఆనాడు తెలంగాణపై నిప్పులు చెలరేగిన మాటలే మాట్లాడిన వారు, ఈ రోజు అదే ఉద్యమాన్ని వాడుకుని లైకులు, వ్యూస్, రేటింగ్‌ల కోసం ఉద్యమ చరిత్రను వక్రీకరించడం అత్యంత దుర్మార్గమైన ధోరణి.కుహనా ఉద్యమ ద్రోహులను స్టూడియోలకు పిలిపించి, నిజంగా పోరాడిన వారిపై అబాండాలు వేయడం ఇప్పుడు కొందరికి అలవాటుగా మారింది. ఇది జర్నలిజం కాదు, ఇది వ్యాపారం. ఇది ప్రజాసేవ కాదు, ఇది స్వార్థ ప్రయోజనం. తెలంగాణ సమాజం కోసం పోరాడిన వారి మీద బురద జల్లడం ద్వారా తమ బతుకులు బాగుపడతాయని భావించడం కుహనా మేధావుల అహంకారానికి పరాకాష్ట.

తెలంగాణ ప్రజలు అమాయకులు కారు. ఎవరు పోరాడారు, ఎవరు లేరు అన్నది వారికి బాగా తెలుసు. ఉద్యమం టీవీ స్క్రీన్‌లలో పుట్టలేదు, ప్రజల రక్తంలో, కన్నీళ్లలో, జ్ఞాపకాలలో రూపుదిద్దుకుంది. ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువ అంచనా వేయడం కుహనా మేధావుల అతిపెద్ద పొరపాటు. చరిత్రను డిబేట్ షోలతో మార్చలేరు, త్యాగాన్ని స్క్రిప్ట్‌లతో కొలవలేరు.

ఇది కేవలం గతం గురించిన చర్చ కాదుఇది భవిష్యత్తుపై ఉన్న బాధ్యత. రేపటి తరాలకు మనం ఏ చరిత్రను అందించబోతున్నాం? జైలుకు వెళ్లినవారా ఉద్యమకారులు? లేక స్టూడియోలో కూర్చుని మాట్లాడినవారా? త్యాగం చేసినవారే ఉద్యమకారులు కాకుండా, మైక్ పట్టుకున్నవారే ఉద్యమ ప్రతినిధులుగా మారితే ప్రజా ఉద్యమాల విలువ ఏమవుతుంది?తెలంగాణ ఉద్యమం అమ్మకానికి కాదు. అది ఒక త్యాగ గాథ, ఒక ప్రజల సంకల్ప కథ. దాన్ని వ్యాపారంగా మార్చడం, వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం వాడుకోవడం చరిత్రకు చేసిన ద్రోహం. నిజమైన ఉద్యమకారులను అవమానించడం మీ తరం కాదు, మీ స్థాయి కాదు. తెలంగాణ ప్రజలు తమ ఉద్యమాన్ని తామే కాపాడుకుంటారు. ఈ నిజం ఎంత త్వరగా అర్థమైతేఅంత మంచిది.

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

## నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటనలో
# నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి


- బాధితులకు ప్రభుత్వ పరంగా యాబై లక్షల ఆర్థిక సాయం అందించాలి
- బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులను కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:**
అగ్రకుల దురహంకారంతో బీసీ కుటుంబానికి చెందిన వారిపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వాళ్లపై హత్యకేసుతో పాటు నిందితులను అందరినీ వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్ మరియు రాపోలు జయప్రకాష్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం టికెట్ లేకుండా కుమ్మెర గ్రామంలోని మల్లన్న గుడిలోకి ప్రవేశించిన కారణంగా చాకలి కులస్తులైన గణేష్ చంద్రకళ మౌనికలపై ఆ గ్రామ సర్పంచ్ తుకారం రెడ్డి మరియు సతీష్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్ రెడ్డిలు ఇంకా కొంతమంది రాయలేని భాషలో దురాహంకారంతో అతి కిరాతకంగా భయంకరంగా వారిపై దాడి చేసి మరియు రెండు నెలల పసి పాప ప్రాణాలు తీసుకున్న హంతకులను కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా యాభై లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ బిసి యువజన సంఘం కార్యాలయం అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వన్ టైం రిజిస్ట్రేషన్ గడువు మరో పది రోజులు పొడిగించండి

- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:**
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 25 వరకు గడువు విధించారని ఆ యొక్క గడువును మరో 10 రోజులు పొడగించాలని కోరుతూ ఈరోజు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా లింగమ్ గౌడ్ మాట్లాడుతూ గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు కూడా తప్పకుండా తిరిగి వారి యొక్క వివరాలన్నింటిని విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పడంతో అందరూ ఒకేసారి అప్లోడ్ చేసుకునే సమయంలో సర్వర్ బిజీ అని వస్తుంది కావున కేవలం రెండు రోజుల సమయం ఉన్నందున ఇంకా ఈ సమయాన్ని పది రోజులు పొడిగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# సైబరాబాద్ తొలి కమిషనర్ ను కలిసిన డా. సత్యం శ్రీరంగం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి కోరుతూ విజ్ఞప్తి...



**కూకట్ పల్లి పిబ్రవరి 23 వెలుతురు :**
నూతనంగా ఏర్పాటు చేసిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి జి. సృజనను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాదాపూర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నూతనంగా ఏర్పడిన సైబరాబాద్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి ప్రస్థానంలో ఇది సరికొత్త అధ్యాయమని, మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అన్నారు. పరిపాలన సౌలభ్యం, వేగవంతమైన అభివృద్ధి కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించారని వివరించారు. కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ను కోరారు. ప్రత్యేకంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో అక్రమ కట్టడాల నియంత్రణ, ప్రధాన రహదారుల మరమ్మత్తులు, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాలపై కమిషనర్ సృజన ఐఏఎస్ సానుకూలంగా స్పందించినట్లు డా. సత్యం శ్రీరంగం తెలిపారు. సైబరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే వేగవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

- సంబంధిత శాఖలకు అందచేసి, పరిష్కరించాలని ఆదేశాలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్ ):**
ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి అదనపు కలెక్టరు (150) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమిస్తే... అడిగేవారెవరు..?

అధికారుల నిర్లక్ష్యం...
భూములు న్యాక్రాంతం.



- కొన్ని నెలలుగా కాలయాపన చేస్తున్న అధికారులు..
- అల్విన్ కాలనీ 1వ ఫేజ్ సొసైటీలో మాయాజాలం..
- కాలనీ సంక్షేమ సంఘం కనుసన్నల్లో ఆక్రమణలు..

- ప్రజా అవసరాల కోసం కేటాయించిన కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం.


- భవిష్యత్తుకు భరోసానిచ్చే హైడ్రా ఈ భూమిని కాపాడేనా..?..కాలనీ వాసులు











**కూకట్ పల్లి పిబ్రవరి 23 వెలుతురు:**
ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు అక్రమార్కులు గద్దలా వాలిపోతున్నారు. కోట్ల రూపాయల విలువైన భూమి అన్యాక్రాంతమవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని ఆల్విన్ కాలనీ 1వ ఫేజ్ లో అక్రమార్కుల కన్ను పడింది. రాజకీయ అధికారుల అండదండలతో ఆ స్థలాలను ఆక్రమించి సొమ్ము చేసుకునే ప్రయత్నాలు మొదలు కావడంతో అసలు యజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీలో సామాజిక అవసరాల కోసం వదిలిన స్థలాలు క్రమంగా అమ్ముకోవడంతో అన్యాక్రాంతమయ్యాయి. ఇప్పుడు ఆ స్థలాలు కేవలం మ్యాప్ లోనే కనిపిస్తుండడం గమనార్హం. కాపాడవలసిన సంక్షేమ సంఘం నాయకులే ప్లాట్లుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఉన్న స్థానిక సంక్షేమ సంఘం నాయకులు కబ్జా దారులతో చేతులు కలిపి సహకరిస్తున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. కబ్జాకు గురైన భూములకు రూ.4 కోట్ల నుంచి 6 కోట్ల వరకు ధర పలుకుతుంది. దీంతో ఇక్కడ అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ఫ్యూచర్ స్కీమ్ భూములను కొట్టేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆల్విన్ కాలనీ లో 15 సంవత్సరాల క్రితం పబ్లిక్ పార్క్, స్కూళ్లు, కమ్యూనిటీ హాల్, ఇతర భవిష్యత్తు తరాల కోసం దాదాపు 70 ప్లాట్ల వరకు కేటాయించడం జరిగింది. ఇందులో 50 ప్లాట్ ల వరకు ఫ్యూచర్ స్కీం భూములు కబ్జాలకు గురయ్యాయి. మిగతా భూములు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడడానికి తప్ప భూములు ఆక్రమించి అమ్మడానికి ఎవరికీ హక్కు లేదు. మిగతా భూమిలో కొందరు సొసైటీని అడ్డుపెట్టుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే, దీనిని స్థానికులు అడ్డుకున్న కూడా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కొన్ని సంవత్సరాల క్రితం ఇదే భూమిని స్థానిక మాజీ సంక్షేమ సంఘం నాయకులు కొందరు కబ్జా చేసి అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మిగిలిన కొంత భూమిని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై తాము అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ లేని ఫ్యూచర్ స్కీం భూమిలోనే కోట్ల రూపాయలు క్రయ విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఫ్యూచర్ స్కీం భూమిలోకి ఎవరూ రాకుండా సూచిక బోర్డులు ఏర్పాటుచేసిన కొందరు అక్రమార్కులు తొలగించి మరీ అక్రమాలకు పాల్పడుతున్నారు. జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదులు చేసిన చర్యలు తీసుకోవడం లేదని నోటీసులు మాత్రమే జారీ చేసి సెటిల్మెంట్లకు తెర లేపుతున్నారని ఆరోపణాలు గట్టిగానే ఉన్నాయి. ఇక్కడ మొత్తం 100 గజాల చొప్పున 8 ప్లాట్లు స్థలాన్ని కబ్జా చేసేందుకు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారు. ఈ భూమి విలువ దాదాపు 6,కోట్లకు పైగా ఉండే అంచనాలు ఉన్నాయి. భవిష్యత్ కోసం ఏర్పాటుచేసిన స్థలాలను ఆక్రమించడం.. ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఆల్విన్ కాలనీ ఫేస్ 1 సమీపంలోని భవిష్యత్ కోసం కేటాయించిన భూమిని గుర్తించడం, ఇళ్ల స్థలాలుగా విక్రయించడం బహిరంగ వ్యాపారంగా మారింది. భూమిని చదును చేసి అక్రమార్కులకు సంబంధించినదిగా నమ్మకం కల్పిస్తున్నారు. ఆ తర్వాత ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్నారు. స్వాధీన అగ్రిమెంట్ చేయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల పట్టా భూమికి చెందిన సర్వే నంబర్లను వేసి కోర్టు ఆర్డర్లతో భవిష్యత్తు కోసం కేటాయించిన భూమిని వ్యాపారం చేస్తున్నారు. అంత విలువ కలిగిన భూమి అన్యాక్రాంతమవుతున్నా జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక వాసులు మండిపడుతున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ఈ భూములను కాపాడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## భవిష్యత్తుకు భరోసానిచ్చే హైడ్రా ఈ భూమిని కాపాడేనా..?

కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, నాలాలే కాకుండా ప్రభుత్వ భూములను కాపాడడానికి ప్రత్యేకంగా ఒక హైడ్రా కమిటీని తీసుకువచ్చి దూకుడు పెంచారు. దీంతో చెరువులు కుంటలు నాళాలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేసిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటే మరోపక్క కబ్జా రాయుళ్లు రూటు మార్చి ప్రభుత్వ భూములపై కన్ను వేశారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారు. హైడ్రా అంటే భరోసా అని చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆల్విన్ కాలనీ 1 వ ఫేజ్ లోని ప్రజా అవసరాల కోసం కేటాయించిన కోట్ల విలువైన భూములను కబ్జా రాయుళ్ల చెర నుండి కాపాడి కబ్జా రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# హయత్‌నగర్‌లో టైగర్స్ కుంగ్-ఫు & కరాటే అకాడమీ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్











**హయత్‌నగర్ వెలుతురు ఫిబ్రవరి 23:**
ఆదివారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ రాజప్ప నగర్‌లోని విశ్వకవి స్కూల్ గ్రౌండ్‌లో టైగర్స్ కుంగ్-ఫు అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అకాడమీ ఆర్గనైజర్ మునుకుంట్ల శివ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, వివిధ ప్రాంతాల నుంచి సుమారు 80 మంది విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు.
బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో భాగంగా ఇద్దరు విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా కే. కార్తికేయ మరియు కే. రాధాకృష్ణ బ్లాక్ బెల్ట్‌ను అర్హతతో సాధించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అకాడమీ రాష్ట్ర కార్యదర్శి మాస్టర్ శ్రీనివాస్ గారు, పాఠశాల చైర్మన్ సాయి ప్రసాద్ గారు హాజరయ్యారు.
కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై, బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో పిల్లలు ముందుకు రావడం గర్వకారణమని వారు తెలిపారు.
ఈ సందర్భంగా , మాట్లాడుతూ, నేటి వేగవంతమైన సమాజంలో పిల్లలు శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా బలంగా ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. చదువుతో పాటు కుంగ్-ఫు వంటి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందడం వల్ల పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు స్వీయ నియంత్రణ పెరుగుతాయని
ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలకు పరిమితమై శారీరక చురుకుదనం కోల్పోతున్నారని, అలాంటి సమయంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. కుంగ్-ఫు సాధన ద్వారా శరీర దృఢత్వం, గుండె ధైర్యం పెరగడంతో పాటు ఆత్మరక్షణలో నైపుణ్యం సాధించవచ్చని వివరించారు.
అలాగే బాలికలు, బాలురకు ఆత్మరక్షణ ఎంతో అవసరమని, కుంగ్-ఫు శిక్షణ ద్వారా ఎలాంటి ఆపద వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనే శక్తి లభిస్తుందని తెలిపారు. ఈ తరహా బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమాలు పిల్లల్లో లక్ష్య సాధనపై ఆసక్తిని పెంచి, కష్టపడి సాధించిన విజయానికి గుర్తుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని మరియు ఆరోగ్యంపై అవగాహనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అతిథులు అలాగే మాస్టర్ మునుకుంట్ల శివ గౌడ్ నీ అభినందించారు.

వెలుతురు

# దేశ సంపదను అమెరికాకు తాకట్టు పెడుతున్న మోడీ

- మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతున్న బీజేపీ ప్రభుత్వంపై పోరాటం నడపాలి.
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్.
- వెల్లంకి గ్రామంలో ప్రారంభమైన సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు.






**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 23:**
ప్రపంచ దోపిడీదారి అమెరికాకు భారత సంపదను నరేంద్ర మోడీ ప్రభుత్వం తాకట్టు పెడుతూ దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తుందని, ఈ చర్యను దేశమేలు కోరే వారంతా ఐక్యంగా ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. వెల్లంకి గ్రామంలో సిపిఎం మండల రాజకీయ శిక్షణ తరగతులు స్థానిక రఘురామ ఫంక్షన్ హాల్ లో ఉత్సాహ పూరితంగా,ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికంగా పార్టీ సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కూరెళ్ళ నరసింహ చారి అధ్యక్షతన జరిగిన రాజకీయ శిక్షణ తరగతులకు బోధకుడిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేస్తూ ఆధిపత్యం చెలాయిస్తుందన్నారు. అపార ఖనిజ సంపద చమురు నిల్వలు ఉన్న దేశాలను ఆక్రమించుకునేందుకు బహిరంగంగా ఆయా దేశ అధ్యక్షులను నిర్బంధిస్తూ అంతర్జాతీయ న్యాయ చట్టాలను తుంగలో తొక్కుతుందన్నారు. ఆయుధ వ్యాపారాన్ని కాపాడుకునేందుకు దేశాల మధ్య యుద్ధాలను సృష్టించి యదేచ్ఛగా ఆయుధాలను సరఫరా చేస్తూ లక్షలాది మంది ప్రాణాలను బలిగొంటుందన్నారు.ప్రపంచ దేశాల గమనాన్ని చిన్నా భిన్నం చేస్తూ ఆధిపత్యం చెలాయిస్తూ యుద్ధోన్మాదాన్ని సృష్టిస్తున్న అమెరికాకు విశ్వగురువు అని చెప్పుకునే భారత ప్రధాని ఈ దేశ సంపదను చీకటి ఒప్పందాలను కుదుర్చుకొని తాకట్టు పెడుతున్నారని అన్నారు. ఏప్స్టిన్ ఫైల్స్ లో మోడీ పేరు ఉన్నందున భయాందోళనతో పార్లమెంటులో కనీసం చర్చ కూడా పెట్టకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొని దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టారన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అంతర్జాతీయ, జాతీయ పరిణామాలను నిత్యం అవగాహన చేసుకొని ప్రజలను చైతన్యం చేసి పోరాటం చేయడంలో ముఖ్యపాత్ర వహించాలని పిలుపునిచ్చారు.

## కుల దురహంకారంతో చిన్నారిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్.శాస్త్ర సాంకేతికత అభివృద్ధి చెందిన ప్రస్తుత కాలంలో అదే స్థాయిలో కులం,మతం అస్తిత్వ వాదాలు ప్రజల మధ్య వైశాల్యాలను సృష్టిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. సిపిఎం మండల శిక్షణ తరగతుల్లో కులం,మతం అస్తిత్వవాదం పరిష్కార మార్గాలు అనే అంశంపై బోధిస్తూ అతిపెద్ద రాజ్యాంగం రాసుకున్న దేశంలో మతం,కులం పేరుతో దాడులు విశృంకలంగా సాగుతున్నాయని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో కులం పేరుతో పెత్తందారులు దేవుడి దర్శనానికి వెళ్లిన రజక వర్గానికి చెందిన కీర్తన కుటుంబంపై దాడి చేసి రెండు నెలల పాపని హత్య చేయడం జరిగిందని అసమానతల భారతానికి నిదర్శనం ఈ ఘటన అని అన్నారు. దోషులను వెంటనే శిక్షించాలని బాదిత కుటుంబానికి న్యాయం చేయాలని కులం పేరుతో జరిగే హత్యలపై పాలకవర్గాలు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్,బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహ చారి, బోయిని ఆనంద్, జంపాల అండాలు, కందుల హనుమంతు, కల్లూరి నగేష్,గ్రామ శాఖ కార్యదర్శి ఆవనగంటి నగేష్, గన్నెబోయిన విజయ భాస్కర్, బావండ్లపల్లి బాలరాజు, బోడిగే రజిత, గొరిగే సోములు, వేముల సైదులు, తొలుపునూరి శ్రీనివాస్, ఎండీ రషీద్, వెల్లంకి గ్రామ నాయకులు కర్రె సంతోష్, ఆవనగంటి స్వామి,బర్ల బాబురావు,ఎర్రోళ్ళ నర్సింహా, తాటిపాముల సంతోష,తాటిపాముల మహేష్,కన్నెబోయిన రాజలింగం, తాటిపాముల వనిత, ఆవనగంటి వెంకటమ్మ, తాటిపాముల నవీన్, కరకంటి మల్లయ్య, పున్న దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికసహాయం అందించిన యువనాయకులు.



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 23:**
గ్రామం ఇంద్రపాలనగరం అకాల మరణం చెందిన రాదారపు ఆగమ్మ మృతుదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన గర్దాస్ విక్రమ్ సర్పంచ్ యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్5000/-రూపాయలు ఆర్థికసహాయం అందించారు. ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, కాటపల్లి యాదయ్య, మందడి విధ్యాసాగర్ రెడ్డి, రాస వెంకటేష్ ,మందడి శ్రీధర్ రెడ్డి,రవ్వనర్సింహా,ఈర్లపల్లి మల్లయ్య , పగుడాల రామచంద్రం,సింగణబోయిన జంగయ్య, సింగణబోయినసత్యనారాయణ,చిన్నపాక సురేష్,గర్దాస్ కరుణాకర్,జిట్టబోయిన వెంకటేష్,నక్క వెంకటేష్, కాటపల్లి మహేష్, బోనగిరి మధు, వెలిమినేటి నరేష్, బోనగిరి వెంకటేష్ , ఈర్లపల్లి రమేష్, నీరుడు నరేష్,కాటపల్లి రమేష్ ,కంబాలపల్లి శ్రీశైలం, గడ్డం సాయి, శివగల్ల జ్ఞానేశ్వర్, నల్ల రమేష్, మాధం నగేష్, రాస సత్తయ్య ,మట్ట యాదయ్య, సింగణబోయిన మల్లేశం,రాదారపు శంకరయ్య,రాధారపు సిద్దయ్య, పావురాల ఐలయ్య,రాధారపు మల్లేశం,రూపనిబాలు,రాదారపు సంగీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాష ప్రాధాన్యత అనే అంశంపై కార్యక్రమం


**- ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ శ్యాం సుందర్**




**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 23:**
స్థానిక రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో పోటీ పరీక్షల్లో ఆంగ్ల భాష ప్రాధాన్యత అను అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ శ్యాంసుందర్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాషయైన ఆంగ్లం ప్రాధాన్యత నేటి సమాజంలో ఎంతో ఉన్నదని, ముఖ్యంగా పోటీ పరీక్షల్లో ఆంగ్ల భాషకు తగిన ప్రాధాన్యత ఉన్నదని అన్నారు. ఆంగ్లభాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ప్రతి విద్యార్థికి ఉన్నదని తెలియజేస్తూ గ్రూప్ చర్చలతో పాటు ఇంటర్వ్యూకు సంబంధించినటువంటి మెలకువలను విద్యార్థులకు అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ ఆంగ్ల భాషా నైపుణ్యం కలిగి ఉంటే తప్పకుండా ఉద్యోగం సాధించడానికి అవకాశం ఉంటుందని ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధిని పొందే సామర్థ్యాన్ని కలిగి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ అధిపతి డాక్టర్ ఎం. లక్ష్మీ నీలిమ, అధ్యాపకురాలు రాధికతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఫిబ్రవరి 21, 22 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు

**- ప్రచారణ కర్త నోముల కుమార్**




**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 23:**
తెలంగాణ సాహితీ కవులు, రచయితల రాష్ట్రవ్యాప్త సంఘం. ఫిబ్రవరి 21, 22 తేదీలలో దశాబ్ది ఉత్సవాలు హైదరాబాదులో జరిగినవి. అందులో పలువు పుస్తకాలు ఆవిష్కరించబడినవి. తెలంగాణ సాహితి,గ్రేటర్ హైదరాబాద్ నగర కమిటీ తరపున "గోలకొండ కలాలు " అనే పుస్తకం ఆవిష్కరించబడింది. దీనికి ప్రచురణకర్తగా నీర్నెముల గ్రామం నుండి నోముల కుమార్ తమ సహాయ సహకారాలు అందించి,అచ్చు వేయించారు. రెండు నెలలుగా 78 మంది కవులు తమ మెదడుకు పని చెప్పి, తరతరాలుగా నిలబడే ఒక విలువైన పుస్తకానికి రూపురు ఇచ్చారు. వందలాది మందిని ఆలోచింపజేసి, చైతన్యాన్ని నింపే, ఈ బృహత్ కార్యానికి కారణమైన నోముల కుమారు గారికి, రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలిపింది తెలిపింది. ఆ సభలో వారిని సత్కరించవలసి ఉంది. అయితే తన అన్న కూతురు పెండ్లి ఒత్తిడిలో పడి, వారు రాలేకపోయారు. ఒక గొప్ప కార్యక్రమానికి ముందుకు వచ్చినందుకుగాను సభలో పాల్గొన్న పలువురు వక్తలు వారిని అభినందించారు. వారికి నా తరపున కూడా ధన్యవాదాలు.ఏభూషి నరసింహ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, తెలంగాణ సాహితి.

# బాల్య మిత్రుడికి ఆర్థిక సహకారము.



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 23:**
తేదీ 28. 12.2025. రోజున బోడిగే నరేష్ గౌడ్ గ్రామం శోభానాద్రిపురం అకాల మరణం చెందడం జరిగినది. వారి కుటుంబానికి ఆర్థికంగా తమవంతు సహాయముగా మిత్రులు, తన తోటి చదువుకున్న విద్యార్థులు...7వ తరగతి,10వ తరగతి (2005-06),ఇంటర్ బ్యాచ్, అందరూ కలిసి 63000 రూపాయలు వారి యొక్క పిల్లల పేరు మీద డిపాజిట్ చేయడం జరిగినది..

# నూతన మున్సిపల్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమావేశం

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లతో స్థానిక శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లను ఎమ్మెల్యే మాణిక్ రావు శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ, "పదవి అనేది కేవలం అధికార హోదా కాదు, ప్రజలు మనపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక. ప్రజల సమస్యలను సమగ్రంగా తెలుసుకొని, పారదర్శకతతో పని చేస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి. ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి," అని సూచించారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో సమన్వయం, బాధ్యత, సేవాభావం అత్యంత



అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ద్వారా మంచి పరిపాలన అందించగలమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొన్నారు.

# రాచన్న స్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన డా. సిద్దం ఉజ్వల్ రెడ్డి





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం బడంపేట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ రాచన్న స్వామి సమేత భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థాన జాతర మహోత్సవాలు భక్తుల రద్దీతో కన్నులపండువగా కొనసాగుతున్నాయి. ప్రాంతీయ భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ జాతర వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ జాతర మహోత్సవాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. సిద్దం ఉజ్వల్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మరియు వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు డా. ఉజ్వల్ రెడ్డిని శాలువాతో సత్కరించి స్వామివారి ఆశీస్సులతో కూడిన ప్రసాదాలను అందజేశారు. భక్తులతో కలిసి కొంతసేపు గడిపిన ఆయన, ఆలయ పరిసరాల్లో జరుగుతున్న జాతర ఏర్పాట్లను పరిశీలించి కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం డా. ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ, రాచన్న స్వామి ఈ ప్రాంత ప్రజల ఇష్టదైవమని, స్వామివారి ఆశీస్సులు జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యత, సౌహార్ద్ర వాతావరణం నెలకొని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, అశ్విన్ పాటిల్, నథానెయల్, జగదీశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ అరుణ్ కుమార్, అక్షయ్ జాడే, రాజు యాదవ్, నర్సింహా యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు జగదీశ్ స్వామి, శ్రీపాల్ రాజయ్య, రాజ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకానంద విద్యామందిర్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మోత్కూర్, ఫిబ్రవరి23,(వెలుతురు న్యూస్ ):**



మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని వివేకానంద విద్యా మందిర్ 2005- 2006 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ను స్థానిక ఎన్ ఎస్ స్పోర్ట్స్ క్లబ్ మినీ ఫంక్షన్ హాల్ లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి వారి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి వివేకానంద పాఠశాల క్రమశిక్షణకు మారుపేరని గుర్తు చేశారు. అప్పటి అధ్యాపక బృందము నేర్పిన విద్యాబుద్ధులతోటి మంచి స్థాయిలో ఉన్నట్లు వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమానికి ముందుగా నాగవెల్లి నాగభూషణం, జయశ్రీ, నాగవెల్లి రఘుమోహన్, అశోక్, జనార్దన్ తో పాటు, పూర్వ విద్యార్థులు గంట దిలీప్ రెడ్డి, కొణతం నిశాంత్ రెడ్డి లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం బిట్ల ఆనంద్, సురిగల రామచంద్రు, బాసాని రాములు, పోలోజు వెంకటేష్, మాశెట్టి వెంకన్న, ఎన్. కె మొయిదీన్,నాగవెల్లి మాధవ్, నాగవెల్లి భార్గవ్, నాగవెల్లి రాజలక్ష్మి, రాజిడి జ్యోతి, ఎండి కుబ్రాభి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ బోగ్ బండార్ వేడుకలు



**తిరుమలగిరి (సాగర్) వెలుతుర్ ఫిబ్రవరి 23:**
తిరుమలగిరి సాగర్ మండల పరిధిలోని తునికినూతల తండాలో గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బోగ్ బండార్ వేడుకలు స్థానిక సర్పంచ్ జాటావత్ బొడ్కా బిచ్చు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అతను హిందూధర్మం గొప్పతనం ధర్మం జ్ఞానం సంప్రదాయం లను బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడు అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ యువకులు పెద్దలు బాలకృష్ణ పట్నాయక్ మాజీ సర్పంచ్ లాలు మాజీ ఎంపీటీసీ లీమా పూజారి మనియా నాగరాజు నాయక్ రేడియా నాయక్ పూరా తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా రాచన్న స్వామి జాతర



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం బడంపేట గ్రామంలో నిర్వహించిన రాచన్న స్వామి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి విభూతి శివరుద్రప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోమవారం తెల్లవారుజామున నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కులు తీర్చుకునేందుకు అగ్నిగుండం పై భక్తులు అగ్గి తొక్కి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. "జై రాచన్న" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. జాతర సందర్భంగా గ్రామంలో ఉత్సవ వాతావరణం నెలకొంది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లాలో పెత్తందారుల చేతిలో బలైన కుటుంబానికి న్యాయం చేయాలి

**- హంతకులను కఠినంగా శిక్షించాలని నాగర్ కర్నూల్ లో జరిగిన ధర్నా**

**- కార్యక్రమంలో పాల్గొన్న బీసీ జెఏసి రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**నాగర్ కర్నూల్ వెలుతురు ఫిబ్రవరి 23:** నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో నాలుగు రోజుల క్రితం టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించిన కారణం గా చాకలి కులస్తులు ఐన గణేష్, చంద్రకళ,మౌనిక ల పై అదే గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి,సతీష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి,మధు రెడ్డి ఇంకా కొంత మంది రాయలేని భాష తో బూతులు తిడుతూ అగ్రకుల దురహంకారంతో అతి కిరాతకంగా భయంకరంగా వారిపై దాడి చేసి మరియు రెండు నెలల పసిబిడ్డ ప్రాణాలు తీసుకున్న హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నాగర్ కర్నూల్ లోని డీఎస్పీ కార్యాలయం ముందు జరిగిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొన్న బీసీ జెఏసి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ ఈ పెత్తందారుల దురహంకార చర్యని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర చర్యగా పరిగణించి వెంటనే నిందితులపై మర్డర్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తుంది.నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ,కలెక్టర్ వెంటనే బాధితులకు భద్రత కల్పించాలి వారికి తగు నష్టపరిహారం చెల్లించాలనీ డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌడుగు మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో 20% నిధులు విద్యకు కేటాయించాలి

**- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ**





**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:** గత 12 సంవత్సరాలలో అటు టిఆర్ఎస్ ప్రభుత్వం ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు బడ్జెట్లో నిధులు తగ్గించడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య 2021 –22లో 27 లక్షల ఉంటే అది ప్రస్తుతం 16 లక్షలకు పడిపోయిందని ప్రొఫెసర్ కే చక్రధర్ రావు అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఐదు సంవత్సరాలలో విద్యార్థుల సంఖ్య వేగంగా పడిపోయి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఒక్క శాతం కూడా మిగలరని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని విద్యా బడ్జెట్ భీమారు రాష్ట్రాలైన రాజస్థాన్,బీహార్ కంటే కూడా తక్కువగా ఉందని సి.పి.ఐ.యం.ఎల్. న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ కె.గోవర్ధన్ చెప్పారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు శ్రీ హనుమేష్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో 1267 ప్రొఫెసర్లు ఉండవలసిన చోట 936 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే యూనివర్సిటీ విద్య ఏ స్థాయిలో దిగజారిందో తెలుస్తుందని చెప్పారు. ఇదే సమావేశంలో ప్రొఫెసర్ శివారెడ్డి మాట్లాడుతూ విద్యా బడ్జెట్ తక్కువగా ఉండడం వలన అవసరం ఉన్నన్ని గదులు లేని పాఠశాలలు 13వేల వరకు ఉన్నాయని, పక్కా కాంపౌండ్ గోడలు లేనివి 13వేల వరకు ఉన్నాయని.....అలాగే దాదాపు 20వేల స్కూల్లో సగటున ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు.ఇటువంటి పరిస్థితులలో నాణ్యమైన విద్య అందడం అసాధ్యమని ఆయన చెప్పారు. ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ 2024 ఆసర్ రిపోర్ట్ ప్రకారం 8వ తరగతి విద్యార్థులు రెండవ తరగతి పుస్తకం చదవలేకపోతున్నారంటే తెలంగాణలో విద్యా ప్రమాణాలు అత్యంత వేగంగా తగ్గిపోతున్నా యని అర్థమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలనే డిమాండ్కు తమ మద్దతు తెలుపుతున్నానని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఎంవిఎఫ్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు ఆర్. వెంకట రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులున్నా కూడా ఉపాధ్యాయులను నియమించకపోవడం దుర్మార్గమని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ నుండి స్టాలిన్, బాలల హక్కుల సంక్షేమ సంఘం నుండి ఇంజమూరి రఘునందన్, టి.పి.టి.ఎఫ్. నుండి తిరుపతి, డిటిఎఫ్ నుండి సోమయ్య తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నుండి వై.అశోక్ కుమార్, యం.రఘుశంకర్ రెడ్డి, కె.రవిచందర్, ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణలు, టి.యు.సి.ఐ. నుండి కే ప్రదీప్, పిడియస్యు నుండి పి మహేష్ గురుకుల ఉపాధ్యాయ సంఘం నుండి సదానందం తదితరులు పాల్గొని మాట్లాడారు.

# ప్రమాదంలో గాయపడిన జర్నలిస్ట్ సామ్రాట్ గుప్తాకు టిడబ్ల్యుజేఎఫ్ అండ



**ఖమ్మం, వెలుతురు ఫిబ్రవరి 23:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలంగాణ బ్రాడకాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీబీజేఏ) జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తాను టిడబ్ల్యుజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్ లు పరామర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యూనియన్ నాయకులు స్పందించి ఖమ్మంలోని భవాని హాస్పిటల్‌కు తరలించి అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహింప జేశారు. వైద్యుల సూచన మేరకు ఆయన కుడి కాలుకు సాధారణ శస్త్రచికిత్స నిర్వహించగా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ చక్రవర్తి వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకుని అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. ప్రమాద సమాచారం అందుకున్న జిల్లా నాయకులు వంగ పుంగమ గౌడ్, కందరబోయిన నాగకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని సామ్రాట్ గుప్తాను ఆసుపత్రికి తరలించడంలో సహకరించారు. అనంతరం శస్త్రచికిత్స పూర్తయ్యాక ఆయనను వైద్యుల సూచన మేరకు విశ్రాంతి కోసం తన నివాసానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి సామ్రాట్ గుప్త కు వైద్య సేవల సహకారం అందించిన జర్నలిస్టు మిత్రులను అభినందించారు. టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) కుటుంబం ఎప్పుడూ ఐక్యంగా ఉండాలని, ఇలాంటి ప్రమాదకర ఘటనలు జరిగినప్పుడు పరస్పర సహకారం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కనుమరుగైతున్న కుమ్మరి వృత్తిని కాపాడతా - ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హామీ




**మిర్యాలగూడ ఫిబ్రవరి 23 వెలుతురు:** తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా, మిర్యాలగూడలో కుమ్మరి సంఘం సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున కుమ్మరి సంఘ సభ్యులు హాజరయ్యారు.జమ్మిశెట్టి వేణుగోపాల్,కామిశెట్టి శ్రీనివాస్,కామిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే భవనంలో ఈ సమావేశం జరిగింది.కుమ్మర సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కుమ్మరులు ఎంతో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్మరి వృత్తికి అవసరమైన మట్టిని సులభంగా పొందేందుకు హక్కు కల్పించాలని,విద్యుత్ సబ్సిడీలు అందించాలని,ప్రతి నియోజకవర్గంలో ప్రతిభావంతులైన యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే ప్రతి గ్రామ దేవతల ఆలయాలలో కుమ్మరులను ప్రథమ పూజారులుగా నియమించాలని కూడా కోరారు.నేరేడుచర్ల కౌన్సిలర్‌గా గెలుపొందిన జనసేన పార్టీ అభ్యర్థి కుమ్మర ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు దంపతులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సన్మానించారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే హామీ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ,మనిషికి నాగరికత నేర్పిన గొప్ప వృత్తి కుమ్మరి వృత్తి అని పేర్కొన్నారు. అలాంటి వృత్తి కనుమరుగైపోవడం బాధాకరమని తెలిపారు.మిర్యాలగూడ నియోజకవర్గంలో కుమ్మరి వృత్తిని కాపాడటానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.త్వరలోనే మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌తో మాట్లాడి కుమ్మరి కులస్తుల ప్రధాన డిమాండ్ అయిన కుండల తయారీ నైపుణ్య కేంద్రానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఇల్లు లేని కుమ్మరి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని,అవసరమైన వివరాలను సంఘ నాయకులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కుమ్మర సంఘ నాయకులు గంగాధరి వెంకటేశ్వర్లు,నిమ్మనగోటి శ్యాంప్రసాద్,నల్గొండ కామిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# రజకుల ప్రాణానికి విలువ లేదా?

**- కుల వివక్షతపై ఆగని దాడులు-న్యాయం చేయాలని రజక సంఘాల ధర్నా**






**గుండాల, ఫిబ్రవరి 23 (వెలుతురు):** కుల వివక్షత కారణంగా అమాయక పసిప్రాణం బలైన ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన సంఘటనను నిరసిస్తూ గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన రజక పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సింగారం ఉప్పలయ్య ధర్నాలో పాల్గొన్నారు.కొమురెల్లి గ్రామానికి చెందిన గణేష్‌మౌనిక దంపతుల రెండు నెలల చిన్నారి దేవాలయ దర్శనం సందర్భంలో జరిగిన ఘర్షణలో ప్రాణాలు కోల్పోయినట్లు నాయకులు తెలిపారు. దర్శనానికి వచ్చిన బాధిత కుటుంబాన్ని అనుమతించకుండా డబ్బులు డిమాండ్ చేయడంతో వాగ్వాదం చోటుచేసుకుని,ఆ తర్వాత జరిగిన దాడిలో చిన్నారి మృతి చెందినట్లు ఆరోపించారు.ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రజక జనచైతన్య సమితి అధ్యక్షులు గంపల శ్రీనివాస్,రాష్ట్ర నాయకులు ఉల్లంగుల నర్సింగులు,మాదరాజు యాకన్న,మావిడాల భాను,సుడిగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు.

# బిజెపి ఎమ్మెల్యే పై దాడిని ఖండిస్తూ మండలంలో నిరసన



**గుండాల, ఫిబ్రవరి 23 (వెలుతురు):** భారతీయ జనతా పార్టీ గుండాల మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఆదివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డిపై దాడి చేయడం తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పింగళి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై దాడి జరగడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారెంటీలు హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందని, ప్రతిపక్షాలపై దాడులు చేయడమే వారికి తెలిసిందని విమర్శించారు.మండల వైస్ ప్రెసిడెంట్ మోకు దయాకర్ రెడ్డి, వెంపటి సురేష్, మండల కోశాధికారి పరమేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టవ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు ఆవుల సాయి తేజ, చుక్క నవీన్, నరసింహా, సంగీత తదితరులు పాల్గొన్నారు.బీజేపీ నాయకులు ఎమ్మెల్యే పై జరిగిన దాడిపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రజావాణి కి 83 దరఖాస్తులు

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)ఫిబ్రవరి 23** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో 83 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు కొరకు , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల పేమెంట్ రాలేదని, పంచాయితీ, drdo, dwo తదితర వాటి దరఖాస్తులను స్వీకరించి అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ గ్రీవెన్స్ లో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, సీఈఓ చందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి లను సన్మానించిన మాజీ జెడ్పీటీసి తీగల తిరుమల గౌడ్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఫిబ్రవరి 23** సోమవారం నాడు మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించి ప్రమాణ స్వీకారం చేసినందుకు ఇప్ప ఉమారాణికి పదవి ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసి కామారెడ్డి సత్య గార్డెన్ లో శాలువాతో ఘనంగా సన్మానించిన దోమకొండ మాజీ జెడ్పీటిసి తిరుమల గౌడ్. కార్యక్రమంలో దోమకొండ మండల అధ్యక్షులు అనంతరెడ్డి పట్టణ టౌన్ అధ్యక్షులు సీతారాం మధు, గోపాల్ రెడ్డి నల్లపు శ్రీనివాస్, శంకర్ రెడ్డి నర్సారెడ్డి మర్రి శేఖర్ తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

- **ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత**
- **పరీక్షించిన వైద్యులు..రెస్ట్ తీసుకోవాలని సూచన**



**కామారెడ్డి,ఫిబ్రవరి23 వెలుతురు:** ఓవైపు కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతున్న వేళ,కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్బంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అయితే మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇదిలావుంటే కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య సవాళ్ల నేపథ్యంలో స్థానికంగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. సోమవారం జిల్లా కలెక్టర్‌తో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భేటీ కావాలనున్నారు. తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో అందుకు సంబంధించిన సాక్ష్యాలు తీసుకురావాలంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు డిగ్రీ కాలేజీ భూముల విషయంలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెంకట రమణారెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రాజీనామాకు సిద్ధం కావాలంటూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై స్పష్టత ఇవ్వాలంటూ అధికారులను బీజేపీ డిమాండ్ చేసింది. ఇలా ఇరు పార్టీనేతల విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేపథ్యంలో పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ఇరు పార్టీల నేతలను కలెక్టర్ కార్యాలయానికి పోలీసులు వెళ్లనిస్తారా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా కామారెడ్డి వెళ్లేందుకు యత్నించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కామారెడ్డి వెళ్తుండగా.. ఆయన్నూ పెద్దశంకర్‌పేట వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే.

# ఈ నెల 26 నుంచి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

జనసేన

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఫిబ్రవరి 23** ఈనెల 26 నుండి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ మచ్చ సుధాకర్ తెలిపారు ప్రతి జనసైనికులు వీర మహిళలు పవన్ కళ్యాణ్ అభిమానులు పార్టీ సభ్యత కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన జనసేన పార్టీ కార్యకర్తలకు వీర మహిళలకు పవన్ కళ్యాణ్ అభిమానులకు పిలుపునిచ్చారు అందరూ సమిష్టి కృషితో ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన అన్నారు జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

# అహంకారం తగ్గితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది!



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం.

*అహంకారం తగ్గితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అనే భావన కేవలం ఒక నైతిక సూక్తి కాదు, అది మానసికశాస్త్రం, సామాజికశాస్త్రం, ఆధ్యాత్మిక తత్త్వచింతనల సమన్వయంతో ఏర్పడిన లోతైన సత్యం. మనిషి వ్యక్తిత్వ వికాసంలో అహంకారం ఒక స్థూలమైన పొరలా పని చేస్తుంది. అది బయటకు బలంగా కనిపించినా లోపల అస్థిరతను దాచిపెడుతుంది. ఆత్మవిశ్వాసం మాత్రం నిశ్శబ్దంగా పెరిగే అంతర్గత శక్తి. అది ప్రకటనా అవసరం లేకుండా వ్యక్తిత్వాన్ని నిలబెడుతుంది.*

అహంకారం అనేది తనను ఇతరుల కంటే ఉన్నతుడిగా భావించడం ద్వారా ఉద్భవిస్తుంది. ఈ భావనకు మూలంలో అసురక్షిత భావన దాగి ఉండే అవకాశముంది. వ్యక్తి తన సామర్థ్యంపై లోపలి అనిశ్చితిని అనుభవించినప్పుడు, ఆ లోటును దాచిపెట్టడానికి అతిశయ ప్రవర్తన ప్రదర్శించవచ్చు. విమర్శ ఎదురైనప్పుడు అతనికి అసహనం కలుగుతుంది. తప్పును ఒప్పుకోవడం కష్టమవుతుంది. ఇతరుల విజయాన్ని అంగీకరించడం కఠినంగా అనిపిస్తుంది. ఈ లక్షణాలు క్రమంగా సంబంధాలలో విరసతను కలిగిస్తాయి. సహకారం తగ్గుతుంది. వ్యక్తి ఒంటరితనాన్ని అనుభవిస్తాడు. అహంకారం పెరిగిన కొద్దీ మనస్సులో రక్షణాత్మక ప్రతిస్పందనలు అధికమవుతాయి. ఈ పరిస్థితిలో వ్యక్తి అభ్యాసాన్ని స్వీకరించలేడు. అభివృద్ధి ప్రక్రియ నిలిచిపోతుంది.

ఆత్మవిశ్వాసం భిన్నమైన స్వరూపం కలిగి ఉంటుంది. అది తన సామర్థ్యాన్ని వాస్తవికంగా అంగీకరించడం ద్వారా పెరుగుతుంది. విజయాన్ని సంతోషంగా స్వీకరిస్తాడు. అపజయాన్ని పాఠంగా తీసుకుంటాడు. విమర్శను విశ్లేషిస్తాడు. అవసరమైతే మార్పు చేసుకుంటాడు. ఇతరుల ప్రతిభను మెచ్చుకుంటాడు. పోలికల కన్నా పురోగతిని ముఖ్యంగా భావిస్తాడు. ఈ దృక్కోణం వల్ల అతని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. సంబంధాలు బలపడతాయి. అభ్యాసం నిరంతర ప్రక్రియగా మారుతుంది. ఇక్కడ వ్యక్తి తన విలువను బాహ్య ప్రశంసలపై ఆధారపరచడు. తన కృషిపై ఆధారపరచుకుంటాడు.

అహంకారం తగ్గడం అనేది ఒక్కసారిగా జరిగే మార్పు కాదు. అది అవగాహనతో మొదలయ్యే అంతర్గత ప్రయాణం. మొదట వ్యక్తి తన ప్రవర్తనను పరిశీలించాలి. విమర్శ ఎదురైనప్పుడు తన ప్రతిస్పందన ఎలా ఉంటుందో గమనించాలి. ఇతరుల విజయాన్ని చూసినప్పుడు తన మనస్సులో ఏ భావన ఉద్భవిస్తుందో విశ్లేషించాలి. తన తప్పును ఒప్పుకునే ధైర్యం ఉందో లేదో ఆలోచించాలి. ఈ పరిశీలనలో నిజాయితీ ఉంటే అహంకారం స్వయంగా క్షీణించడం ప్రారంభిస్తుంది.

స్వీయ అవగాహన పెరిగినప్పుడు వ్యక్తి తన పరిమితులను అంగీకరిస్తాడు. పరిమితులను అంగీకరించడం బలహీనత కాదు; అది పరిపక్వత. ఈ అంగీకారం వల్ల నేర్చుకోవడానికి సిద్ధత పెరుగుతుంది. నేర్చుకోవడం ద్వారా నైపుణ్యం పెరుగుతుంది. నైపుణ్యం పెరిగిన కొద్దీ ఆత్మవిశ్వాసం స్థిరపడుతుంది. ఈ ప్రక్రియలో అహంకారం అవసరం లేకుండా పోతుంది. ఎందుకంటే తన సామర్థ్యం గురించి అతనికి స్పష్టమైన అవగాహన ఉంటుంది.

సామాజిక పరంగా కూడా ఇదే సత్యం స్పష్టమవుతుంది. వినయం ఉన్న వ్యక్తులు సంబంధాలను దీర్ఘకాలం నిలబెట్టగలరు. వారు ఇతరుల మాట వింటారు. అభిప్రాయాలను గౌరవిస్తారు. సహకారాన్ని విలువైనదిగా చూస్తారు. ఈ గుణాలు వ్యక్తికి సామాజిక మద్దతు అందిస్తాయి. సామాజిక మద్దతు ఉన్నప్పుడు మనస్సు ధైర్యంగా ఉంటుంది. ఆ ధైర్యమే ఆత్మవిశ్వాసానికి మూలం. అహంకారం ఉన్న వ్యక్తికి తాత్కాలికంగా ప్రశంసలు లభించినా, నమ్మక సంబంధాలు తగ్గిపోతాయి. నమ్మకం లేకుండా ఆత్మవిశ్వాసం నిలవదు.

వృత్తి జీవితంలో అహంకారం ఒక పెద్ద అడ్డంకి. జట్టు పనిలో ఇతరులను చిన్నచూపు చూడడం వల్ల సహకారం తగ్గుతుంది. నిర్ణయాల్లో తప్పులు జరిగే అవకాశాలు పెరుగుతాయి. వినయంతో నాయకత్వం వహించినప్పుడు జట్టు సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకుంటారు. ఈ వాతావరణం సృజనాత్మకతను పెంచుతుంది. నాయకుడి ఆత్మవిశ్వాసం కూడా బలపడుతుంది. ఎందుకంటే అతను ఒంటరిగా నిలబడటం కాదు; జట్టుతో కలిసి ఎదుగుతున్నాడు.

కుటుంబ జీవనంలో అహంకారం చిన్న విషయాలనే పెద్ద విభేదాలుగా మారుస్తుంది. "నేనే సరైనవాడిని" అనే పట్టుదల సంభాషణను నిలిపేస్తుంది. వినయం ఉన్నప్పుడు వినడానికి సిద్ధత పెరుగుతుంది. పరస్పర గౌరవం బలపడుతుంది. కుటుంబంలో భద్రతా భావం ఏర్పడుతుంది. ఈ భద్రతే పిల్లలలో కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అందువల్ల అహంకారం తగ్గడం వ్యక్తిగత ప్రయోజనం మాత్రమే కాదు; కుటుంబ స్థిరత్వానికి కూడా అవసరం.

ఆధ్యాత్మిక దృష్టిలో అహంకారం మనస్సును నిరంతరం కదిలించే శక్తి. అది పోలికలు, స్వార్థం, అసూయ, కోపం వంటి భావనలకు మూలం. వినయం వచ్చినప్పుడు మనస్సు నిశ్శబ్దంగా మారుతుంది. కృతజ్ఞత భావం పెరుగుతుంది. ఇతరుల పట్ల దయా దృక్కోణం వికసిస్తుంది. ఈ స్థితిలో వ్యక్తి తన అంతర్గత శక్తిని స్పష్టంగా అనుభవిస్తాడు. ఆ అనుభవం బాహ్య గుర్తింపులపై ఆధారపడదు. అది అంతర్గత ధైర్యంగా నిలుస్తుంది. అదే పరిపక్వమైన ఆత్మవిశ్వాసం.

ముగింపుగా, అహంకారం తగ్గితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అనే సూత్రం మానవ వ్యక్తిత్వ వికాసంలో అత్యంత గంభీరమైన సత్యంగా నిలుస్తుంది. అహంకారం బయటికి బలంగా కనిపించినా లోపల అస్థిరతను పెంచుతుంది. ఆత్మవిశ్వాసం లోపలి స్థిరత్వాన్ని బలపరుస్తుంది. వినయం ద్వారా పుట్టే ఆత్మబలం స్థిరమైనది. అది కాలంతో పాటు పెరుగుతుంది. జీవితంలోని ప్రతి విభాగంలో వ్యక్తిని నిలబెడుతుంది.

అహంకారం తగ్గించడం అనేది తనను తాను తగ్గించుకోవడం కాదు; తప్పుడు అతిశయాన్ని విడిచిపెట్టడం. తన పరిమితులను అంగీకరించడం. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండడం. ఈ ప్రక్రియలో భయం కరుగుతుంది. పోలికలు తగ్గుతాయి. సంబంధాలు బలపడతాయి. అభ్యాసం సులభమవుతుంది. ప్రయత్నం పెరుగుతుంది. ప్రయత్నం పెరిగిన కొద్దీ నైపుణ్యం పెరుగుతుంది. నైపుణ్యం పెరిగిన కొద్దీ ఆత్మవిశ్వాసం స్థిరపడుతుంది.

అహంకారం వ్యక్తిని ప్రదర్శన వైపు నడిపిస్తుంది. ఆత్మవిశ్వాసం వ్యక్తిని పురోగతి వైపు నడిపిస్తుంది. ప్రదర్శనకు ప్రేక్షకులు అవసరం. పురోగతికి కృషి అవసరం. అహంకారం తాత్కాలిక ఆనందం ఇస్తుంది. ఆత్మవిశ్వాసం దీర్ఘకాల సంతృప్తి ఇస్తుంది. ఈ రెండు మధ్య తేడాను లోతుగా గ్రహించినప్పుడు జీవితం యొక్క దిశ స్పష్టమవుతుంది.చివరగా చెప్పాలంటే, వినయం అనేది ఆత్మవిశ్వాసానికి మూలాధారం. అహంకారం కరిగిన చోటే నిజమైన ధైర్యం పుడుతుంది. తనను తాను తెలుసుకున్న వ్యక్తి ఎవరితోనూ పోల్చుకోవలసిన అవసరం అనుభవించడు. అతని బలం అతని అవగాహన. అతని విశ్వాసం అతని కృషి. అతని స్థిరత్వం అతని వినయం. ఇదే సార్థక జీవితం వైపు నడిపించే మార్గం. అహంకారం తగ్గితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అనే సూత్రం మానవ వికాస శాస్త్రంలో అత్యంత ప్రాముఖ్యత గల అంతర్గత పరిణామంగా చూడాలి. వ్యక్తి జీవన ప్రయాణంలో ఎన్నో విజయాలు, అపజయాలు, ప్రశంసలు, విమర్శలు ఎదురవుతాయి. ఈ అనుభవాలన్నింటినీ ఎలా స్వీకరిస్తాడో అదే అతని వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తుంది. అహంకారం ఉన్నప్పుడు విజయాన్ని అతను తన గొప్పతనానికి సాక్ష్యంగా భావిస్తాడు; అపజయాన్ని అవమానంగా తీసుకుంటాడు. ఈ ద్వంద్వ భావన అతని మనస్సులో స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది. ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడు మాత్రం విజయాన్ని కృషి ఫలితంగా అంగీకరిస్తాడు; అపజయాన్ని అభ్యాస ప్రక్రియలో భాగంగా స్వీకరిస్తాడు. ఈ తేడా సూక్ష్మంగా కనిపించినా ప్రభావం లోతైనది.

అహంకారం మనస్సులో ఒక రక్షణ గోడలా నిలుస్తుంది. అది వ్యక్తిని విమర్శల నుండి కాపాడినట్టుగా అనిపిస్తుంది. కాని అదే గోడ అతన్ని అభ్యాసం నుండి దూరం చేస్తుంది. ఎవరైనా సూచన ఇచ్చినా అది తన ప్రతిష్ఠకు భంగమని భావిస్తాడు. ఈ ధోరణి క్రమంగా ఎదుగుదలను అడ్డుకుంటుంది. వినయం వచ్చినప్పుడు మాత్రం సూచనలను ఆత్మపరిశీలనతో చూడగలుగుతాడు. తనలో మార్పు అవసరమైతే అంగీకరిస్తాడు. ఈ అంగీకారంలో బలహీనత లేదు; అది పరిపక్వతకు సంకేతం. పరిపక్వత పెరిగిన కొద్దీ ఆత్మవిశ్వాసం స్థిరపడుతుంది.

సంబంధాల దృష్టిలో కూడా ఇదే నిజం. అహంకారం ఉన్నప్పుడు సంభాషణ ఏకపక్షంగా మారుతుంది. వినడం తగ్గుతుంది. తీర్పు ఇవ్వడం పెరుగుతుంది. ఇతరుల భావాలను అర్థం చేసుకునే ప్రయత్నం తగ్గిపోతుంది. ఈ పరిస్థితిలో సంబంధాలు సన్నగిల్లుతాయి. వినయం పెరిగినప్పుడు వినడం మొదలవుతుంది. పరస్పర గౌరవం బలపడుతుంది. విభేదాలు ఉన్నా అవి సంభాషణ ద్వారా పరిష్కరించబడతాయి. ఈ భద్రతా వాతావరణం వ్యక్తికి మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. అదే ఆత్మవిశ్వాసానికి పోషణగా నిలుస్తుంది.

అహంకారం తగ్గడం అనేది అంతర్గత శుద్ధి ప్రక్రియ. ఇది ఒక సాధన. ప్రతిరోజూ తన ఆలోచనలను గమనించడం, ప్రతిస్పందనలను విశ్లేషించడం, ఎక్కడ అతిశయం వ్యక్తమైందో గుర్తించడం అవసరం. ఈ గమనింపు మొదట కఠినంగా అనిపించవచ్చు. ఎందుకంటే మనిషి తనను తాను విమర్శించడానికి ఇష్టపడడు. అయినప్పటికీ నిజాయితీతో తన ప్రవర్తనను పరిశీలించినప్పుడు మార్పు మొదలవుతుంది. ఈ మార్పు నెమ్మదిగా సాగుతుంది. కాని దాని ఫలితం దీర్ఘకాలికం. ఆత్మవిశ్వాసం పెరగడం అనేది గర్జనతో ప్రకటించుకునే విషయం కాదు. అది నిశ్శబ్దంగా పెరుగుతుంది. వ్యక్తి తన లక్ష్యాన్ని స్పష్టంగా చూసి, దానికోసం క్రమశిక్షణతో కృషి చేసినప్పుడు ఆత్మవిశ్వాసం బలపడుతుంది. ఇక్కడ ఇతరుల ప్రశంస అవసరం ఉండదు. తన ప్రగతిని తానే గమనిస్తాడు. తన అభివృద్ధిని తానే అంచనా వేస్తాడు. ఈ అంతర్గత ప్రమాణాలే అతనికి ధైర్యం ఇస్తాయి.

అహంకారం తగ్గినప్పుడు పోలికలు తగ్గుతాయి. పోలికలు తగ్గినప్పుడు అసూయ తగ్గుతుంది. అసూయ తగ్గినప్పుడు మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ప్రశాంతత ఉన్నప్పుడు నిర్ణయాలు స్పష్టంగా ఉంటాయి. స్పష్టత ఉన్నప్పుడు చర్యలు సమర్థవంతంగా ఉంటాయి. ఈ చర్యల ఫలితంగా విజయం లభిస్తుంది. ఈ విజయం అహంకారాన్ని పెంచదు; ఎందుకంటే అది కృషి ఫలితమని వ్యక్తికి తెలుసు. ఈ అవగాహనతో వచ్చిన ధైర్యమే స్థిరమైన ఆత్మవిశ్వాసం.

విద్యా రంగంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అహంకారం ఉన్న విద్యార్థి తనకు తెలిసినదానిపై మాత్రమే ఆధారపడతాడు. కొత్త విషయాలను స్వీకరించడంలో వెనుకడుగు వేస్తాడు. ప్రశ్న అడగడాన్ని తన ప్రతిష్ఠకు హానిగా భావిస్తాడు. వినయం ఉన్న విద్యార్థి మాత్రం తెలియనిదాన్ని అంగీకరిస్తాడు. ప్రశ్నలు అడుగుతాడు. తప్పులను సరిదిద్దుకుంటాడు. ఈ ప్రక్రియలో అతని జ్ఞానం విస్తరిస్తుంది. జ్ఞానం పెరిగిన కొద్దీ ఆత్మవిశ్వాసం బలపడుతుంది.

నాయకత్వంలో కూడా ఇదే సత్యం. అహంకార నాయకుడు తన నిర్ణయాలను ప్రశ్నించనీయడు. భయం ఆధారంగా వ్యవహరిస్తాడు. వినయ నాయకుడు మాత్రం తన జట్టును భాగస్వాములుగా చూస్తాడు. సూచనలను ఆహ్వానిస్తాడు. తప్పు జరిగితే బాధ్యత స్వీకరిస్తాడు. ఈ గుణాలు జట్టులో నమ్మకాన్ని పెంచుతాయి. నమ్మకం ఉన్నచోట ధైర్యం పెరుగుతుంది. ధైర్యం ఉన్నచోట ఆత్మవిశ్వాసం వికసిస్తుంది.

ఆధ్యాత్మిక దృష్టిలో అహంకారం అనేది "నేనే కర్త" అనే భావన. ఈ భావన తగ్గినప్పుడు జీవితం యొక్క విశాల దృశ్యం కనిపిస్తుంది. ప్రతి విజయం తన ఒక్కడి కృషి ఫలితం కాదని, అనేక కారణాల సమ్మేళనమని అర్థమవుతుంది. ఈ అవగాహన కృతజ్ఞతను పెంచుతుంది. కృతజ్ఞత ఉన్నచోట అహంకారం నిలవదు. కృతజ్ఞతతో కూడిన జీవన విధానం మనస్సును స్థిరంగా ఉంచుతుంది. స్థిరత్వం ఉన్నప్పుడు ఆత్మవిశ్వాసం సహజంగా పెరుగుతుంది.

అహంకారం తగ్గడం అనేది ఓటమి కాదు. అది స్వీయ విజయం. మనస్సులోని అతిశయాన్ని జయించడం గొప్ప సాధన. తన పరిమితులను అంగీకరించడం ధైర్యం. తన తప్పును ఒప్పుకోవడం పరిపక్వత. ఇతరుల విజయాన్ని మెచ్చుకోవడం విశాల హృదయం. ఈ గుణాల సమాహారం వ్యక్తిని సమతుల్యంగా నిలబెడుతుంది. సమతుల్యతే ఆత్మవిశ్వాసానికి మూలాధారం.

చివరగా, జీవితం ఒక నిరంతర అభ్యాస యాత్ర. ఈ యాత్రలో అహంకారం భారంగా మారుతుంది. వినయం దారిని సులభతరం చేస్తుంది. అహంకారం మనిషిని ఒంటరిగా నిలబెడుతుంది. వినయం అతన్ని సమాజంతో అనుసంధానిస్తుంది. అహంకారం భయాన్ని పెంచుతుంది. ఆత్మవిశ్వాసం భయాన్ని కరిగిస్తుంది. ఈ మార్పు ఒక్కరోజులో సాధ్యం కాదు. కాని అవగాహనతో మొదలైన ప్రయాణం తప్పక ఫలిస్తుంది.

అందువల్ల అహంకారం తగ్గించడం వ్యక్తిత్వ నిర్మాణంలో ఒక ముఖ్యమైన సంస్కరణ. ఆ సంస్కరణ వల్ల లోపలి అస్థిరత తొలగుతుంది. భయం తగ్గుతుంది. పోలికలు క్షీణిస్తాయి. సహకారం పెరుగుతుంది. కృతజ్ఞత వికసిస్తుంది. ఈ మార్పుల సమాహారమే ఆత్మవిశ్వాస వృద్ధి. వినయం ద్వారా పుట్టే ఆత్మబలం స్థిరమైనది, దీర్ఘకాలికమైనది, సమతుల్యమైనది. ఇదే నిజమైన విజయం, ఇదే సార్థక జీవితం.

## నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు: కెటిఆర్



**హైదరాబాద్,ఫిబ్రవరి23 వెలుతురు:**
తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

- నేడు అసెంబ్లీలో వివరాలు ప్రవేశ పెడతాం
- వైకాపా దేవదేవుడిని రోడ్డుకు లాంగింది
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి లోకేశ్

**అమరావతి,ఫిబ్రవరి23 వెలుతురు:**
తిరుమలో కొలువుదీరిన దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగా బయటపెడతామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలన్నీ మంగళవారం అసెంబ్లీలో పెడతామని తెలిపారు. సోమవారం అసెంబ్లీ లాబీలో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. సభకు రావడం సభ్యులుగా వారి బాధ్యత అంటూ వైసీపీ ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. అసెంబ్లీకి రమ్మని ఎవ్వరూ బొట్టుపెట్టి పిలవరంటూ ఈ సందర్భంగా వారికి చురకలంటించారు. దేవుడిని సైతం వైసీపీ రోడ్డు మీదకు తీసుకురావడం బాధాకరమన్నారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు చేయడం అభ్యంతరకరమని లోకేశ్ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణ వెల్లువెత్తాయి. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ నివేదికను ఇటీవల ప్రభుత్వానికి అందజేసింది సిట్. అయితే ఈ వ్యవహారంలో తమ తప్పేమీ లేదంటూ వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. అంతేకాకుండా..



కూటమి ప్రభుత్వం తమపై అసత్య ప్రచారం చేస్తోందంటూ వైసీపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెడతామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవరూ బొట్టుపెట్టి పిలవరని వైకాపా ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైకాపా నేతలు రోడ్డు మీదకు తీసుకురావడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమన్నారు.

## పది రోజుల శిక్షణా శిబిరానికి హాజరైన ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి







**వికారాబాద్ వెలుతురు ఫిబ్రవరి 23:**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల పది రోజుల శిక్షణా శిబిరానికి హాజరైన ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి హాజరయ్యారు. వికారాబాద్ అనంతగిరిలో జరుగుతున్న ఈ ప్రత్యేక శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజల సమస్యలపై సమగ్ర అవగాహనతో పనిచేసే నాయకత్వమే పార్టీకి శక్తినిస్తుందని అన్నారు. డిసిసి అధ్యక్షులు కేవలం నిర్వాహకులు మాత్రమే కాకుండా, ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించే సైనికులుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత డిసిసి అధ్యక్షులపై ఉందన్నారు. పార్టీ కేడర్‌తో సమన్వయం, యువతను ఆకర్షించే కార్యక్రమాలు, సోషల్ మీడియా వినియోగం వంటి అంశాలపై కూడా ఆయన సూచనలు చేశారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా బూత్ స్థాయిలో బలమైన కమిటీలు ఏర్పాటు చేసి, ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించాలన్నారు.

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

- అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతరామన్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 వెలుతురు:**
దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు..భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,724 పెరిగి.. రూ.1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.15,931 పెరిగి రూ.2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు' అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

**- ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం**



**శ్రీనగర్, ఫిబ్రవరి23( వెలుతురు):**
జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైపుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

# మాజీ రైల్వేమంత్రి ముకుల్ రాయ్ మృతి



**కోల్‌కతా,ఫిబ్రవరి23( వెలుతురు):**
మాజీ రైల్వే మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు ముకుల్ రాయ్ మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. రాయ్ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారు. అనేక అనారోగ్యాలతో బాధపడుతున్న రాయ్ కొన్ని రోజుల క్రితం కోమాలో ఉన్నారు. మృతదేహాన్ని ఆయన నివాసానికి తీసుకెళ్లి, అంత్యక్రియలు నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా ముకుల్ రాయ్ ఆసుపత్రిలో, ఆయన నివాసంలో చికిత్స పొందుతున్నారు. తెలిసిన ముఖాలను కూడా ఆయన గుర్తించే సామర్థ్యాన్ని కోల్పోయారు. ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సన్నిహితుడు. ఆయన 2017లో బిజెపిలో చేరారు. ముకుల్ రాజీనామా తర్వాత, తృణమూల్ నుండి అనేక ఫిరాయింపులు జరిగాయి.

# నది దాటుకుంటూ వచ్చిన విద్యార్థులు

**- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని హాజరు**



**విజయవాడ,ఫిబ్రవరి23( వెలుతురు):**
విజయవాడ మన్యం జిల్లాలోని నాగవల్లి నది దాటుకుంటూ ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు రాయడానికి విద్యార్థులువెళ్లారు. వేరే మార్గం లేక వారు నది దీటుకుంటూ వచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం చాణక్య కాలేజీకి చెందిన యర్రా హేమశ్రీ ఉప్పులూరు గ్రామానికి చెందిన విద్యార్ది ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినా సోమవారం ఇంటర్ మీడీయట్ పరిక్షలకు తన తండ్రి సహకారంతో హజరైనట్లు చాణక్య కాలేజీ ప్రతినిధి చెప్పారు. హేమశ్రీ తన కాలేజీలో బెస్ట్ విద్యార్దిని చెప్పారు. నడవలేని స్తితిలో ఉన్నప్పటి హేమశ్రీ పరిక్షలకు హజరైనట్లు చెప్పారు. మార్చి 24 వరకు జరగనున్న పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా వెల్లడించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సిసిటివి కెమెరాల నిఘా ఉంటుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లా స్థాయి పరీక్షా కమిటీలు (డిఇసి), ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు నిరంతరం తనిఖీలు చేస్తాయని పేర్కొన్నారు. పరీక్ష సమయం దాటి నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని, విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అత్యవసర సమస్యల కోసం బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నెంబరు 18004251531కు ఫోన్ చేయాలని వెల్లడించారు.

# ప్రారంభం అయిన ఇంటర్ పరీక్షలు

**- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు**

**తెనాలి,ఫిబ్రవరి23( వెలుతురు):**
రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ఇంటర్ పరీక్షలుప్రారంభం అయ్యాయి. ఇంటర్ బోర్డ్ కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తిచేసింది. ప్రశాంత వాతావరణం నడుమ అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద పోలీస్ శాఖ బందోబస్త్ కట్టుదిట్టం చేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పనలో ఎటువంటి అలసత్వం వహించవద్దని అధికారులు ఆదేశాలు జారీచేశారు. స్థానిక కొత్తపేట వివేక కళాశాల పరీక్ష కేంద్రం వద్ద వన్ టౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో తెనాలి డిఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో తెనాలి డివిజన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేవిధంగా భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

**- ఇప్పటికే నలుగురు మృతి..**
**మరో నలుగురి పరిస్థితి విషమం**
**- పాలవ్యాపారి గణెళిశ్ అరెస్ట్..**
**పరీక్షలకు పాల నమూనాలు**



**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి23(వెలుతురు):**
రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెళిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణెళిష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

# అనూరియా వ్యాధిపై ఇంటింటి సర్వే

**- 73 శాంపిల్స్ సేకరించి పరీక్షలకు అందచేత**
**- నలుగురు మృతి..12 మంది ఆస్పత్రుల్లో చికిత్స**
**- అధికారులతో కలసి సమీక్షించిన కలెక్టర్ కీర్తి**



**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి23( వెలుతురు):**
అనూరియా వ్యాధితో రాజమహేంద్రవరంలో ఆసుపత్రుల్లో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరిందని జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని ఆమె తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఇంటింటా సర్వే నిర్వహించి 73 శాంపిల్స్ సేకరించామని వివరించారు. అలాగే పాల వ్యాపారికి చెందిన 42 గేదెల నుంచి పాలు సేకరించి.. ఆ శాంపిల్స్‌ను కూడా హైదరాబాద్ ల్యాబొరేటరీలకు పంపామన్నారు. రాజమహేంద్రవరంలో చోటు చేసుకున్న అనూరియా అంటే మూత్రం నిలిచిపోవడంపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ ఘటనకు సంబంధించిన అంశాలను ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ÷రాజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 15 నుంచి పలువురు వాంతులవడం, మూత్ర విసర్జన కాకపోవడం, కడుపు ఉబ్బరం తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఈ రకమైన కారణాలతో 14 మంది నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో బి.కనకరత్నం(76), తాడి కృష్ణవేడి(75) ఇప్పటికే మృతిచెందారు. వ్యాధికి గురైన వారిలో 60 ఏళ్లు పైబడిన వారే అధికంగా ఉన్నారు. 5 నెలల శిశువుతో పాటు మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే అనూరియా వ్యాధి బారినపడిన వారందరికి ఒకే వ్యక్తి పాలు సరఫరా చేస్తున్నట్లు వైద్యధికారులకు బాధితులు వెల్లడించారు. దీంతో పాల కల్తీ జరిగి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. శివరాత్రి అంటే.. ఫిబ్రవరి 15న పాలు,పెరుగు చేదుగా అనిపించాయని బాధితులు వివరించారు. దీంతో పాల సదరు వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే బాధితుల రక్త, మూత్ర నమూనాలను ల్యాబ్‌కు పంపారు. ఆ నమూనాలకు నివేదికలు అందాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఇందులో కొత్త కేసులేవి నమోదు కాలేదని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

# సత్ప్రవర్తన ఖైదీలకు క్షమాభిక్ష

**- ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న హోంమంత్రి**
**- జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లుపై అనిత**

**అమరావతి,ఫిబ్రవరి23( వెలుతురు):**
జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఇక ఈ బిల్లుపై చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చట్టంలో ప్రస్తావన లేదన్నారు. జైళ్లలో ఖైదీల సంఖ్య పెరిగినా సౌకర్యాలు మాత్రం



పెరగటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జైళ్ల శాఖలో 30 శాతం సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయని వివరించారు. జైళ్లలో మహిళా సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. అండర్ ట్రయల్ ఖైదీలు న్యాయ సహాయం లేకపోవడంతో జైళ్లలోనే ఉండిపోతున్నారని గుర్తు చేశారు. చిన్న చిన్న కేసుల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారి సత్ ప్రవర్తన ఆధారంగా బయటకు పంపించాలన్నారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చాక జనజీవన స్రవంతిలో కలిసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో తాము సైతం జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. జీవిత ఖైదు పడిన ఖైదులు 60 ఏళ్లు వయసు దాటిన వారికి క్షమాబిక్ష ప్రసాదించాలంటూ ప్రభుత్వానికి సూచించారు. క్షమాబిక్ష కోసం జైళ్లలోని చాలామంది ఖైదీలు ఎదురు చూస్తున్నారన్నారు. ఆ తర్వాత జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

# ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల

**- డీఎస్సీ కూడా అందులోనే ఉంటుంది**
**- ప్రశ్నోత్తరాల సమయంలో**
**మంత్రి లోకేశ్ సమాధానం**

**అమరావతి,ఫిబ్రవరి23( వెలుతురు):**
రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ(ఆ÷ూఅ) పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

# పాలకల్తీ మరణాలపై చంద్రబాబు ఆరా

**- అధికారులతో సమీక్షించి**
**తక్షణ చర్యలకు ఆదేశం**




**అమరావతి,ఫిబ్రవరి23( వెలుతురు):**
రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికుల అస్వస్థత, మరణాలపై సీఎం చంద్రబాబు ఆరా తీసారు. పాలకల్తీ వ్యవహారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్యశాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్‌గా ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న సాయాన్ని సీఎంకు వారు వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశించారు. అధికారులు వెంటనే అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. బాదజతులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో విక్రయదారులు 106 ఇళ్లకు పాలు పంపిణీ చేశారని అధికారులు వివరించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 73 మంది నుంచి రక్తనమూనాలను సేకరించామని.. మిగిలిన వారివి కూడా సేకరిస్తున్నామని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారని తెలిపారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలతో పాటు ర్యాపిడ్ టెస్ట్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని సీఎంకు అధికారులు వివరించారు. పాల నమూనాలపై ఫలితాల అనంతరం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే రాజమహేంద్రవరం వెళ్లాలన్నారు.

# మండలి చైర్మన్‌ను కలిసిన కూటమి ఎమ్మెల్సీలు



**అమరావతి,ఫిబ్రవరి23( వెలుతురు):**
శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజును కూటమి ఎమ్మెల్సీలు ఆయన ఛాంబర్‌లో కలిశారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలతో సభకు వచ్చిన ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విలువైన సమయం వృథా చేయకుండా చూడాలని.. సభ సజావుగా నడిపించాలని కోరారు.

# జాతరలో అమానుష ఘటన

**- చర్యలు తీసుకోవాలని డిజిపికి ఫిర్యాదు**



**హైదరాబాద్,ఫిబ్రవరి23( వెలుతురు):**
కుమ్మెరా జాతరలో అమానుష ఘటనపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోకి వెళ్లి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అగ్రకులానికి చెందిన నాయకుడు రజక కులానికి చెందిన రెండు నెలల పసికందును తన్ని చంపిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు వెలికితీయాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, ఉపేందర్ చారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్, నేతలు స్వామి యాదవ్ ,రాజు తదితరులున్నారు.

వెలుతురు

cinema

# అల్లువారింట పెళ్లి సందడి

## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం





అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.

# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు విజయ్


టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.




# ది ప్యారడైజ్ నుంచి ప్రోమో సాంగ్ విడుదల

నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.




# ఓజి దర్శకుడితో నాని బ్లడీ రోమియో

'ఓజీ' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని ఓ స్టైలిష్ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుట్టాడు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ, సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగమని సమాచారం. ఈ కాంబినేషన్ ప్రకటించగానే అభిమానుల్లో భారీ ఎ÷-జగ్జైట్మెంట్ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ సెన్సేషన్ తృప్తి డిమ్రి పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆమె సందీప్ రెడ్డి వంగా- ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్‌లో నటిస్తోంది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో కూడా ఆమె ఓకే అయితే, ఇది ఆమెకు రెండో తెలుగు సినిమా అవుతుంది. 'యానిమల్ ' చిత్రంతో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి, నాని సరసన నటిస్తే ఆ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం అంటున్నారు సినీ విశ్లేషకులు. ఒకవైపు రా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్, మరోవైపు స్టైలిష్ యాక్షన్ డ్రామా ఇలా రెండు విభిన్న జానర్లలో నాని తన నటనా పరిధిని విస్తరించుకుంటున్నాడు. కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చే హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఈ రెండు సినిమాలతో మరోసారి తన రేంజ్‌ను నిరూపించు కునేందుకు సిద్ధమవుతున్నాడు. మొత్తానికి 'ది ప్యారడైజ్' మరియు 'బ్లడీ రోమియో' ప్రాజెక్ట్‌లు నాని కెరీర్‌లో కీలక మైలురాళ్లుగా నిలవనున్నాయా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అధికారిక ప్రకటనలు వెలువడే వరకు ఈ క్రేజీ కాంబినేషన్‌లపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి.

# త్రివిక్రమ్-వెంకి కాంబోలో ఎకె 47

టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం.ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్-వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి.ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.




# ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన జర్నీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయనకు విజయాలు రాత్రికి రాత్రే రాలేదు. ఆ ప్రయాణం మొత్తం ఈ పాటలో వినిపిస్తుంది' అని హరీష్ శంకర్ అన్నారు. అభిమానులు పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం చేస్తారని, కానీ దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటతో పాటాభిషేకం చేశారని, చంద్రబోస్ తన సిరాతో సిరాభిషేకం చేశారని



ఆయన పేర్కొన్నారు. అయితే పవన్ కళ్యాణ్ డబ్బుకి ఏమాత్రం లొంగని వ్యక్తి అని హరీష్ శంకర్ స్పష్టం చేశారు. 'గబ్బర్ సింగ్' తర్వాత అనేక మంది నిర్మాతలు, కార్పొరేట్ సంస్థలు సినిమాలు, యాడ్స్ కోసం సంప్రదించారని తెలిపారు. 2012లోనే పాన్ ఇండియా అనే పదం లేకపోయినా, ఒక యాడ్ కోసం షారుఖ్ ఖాన్ తీసుకునేంత రెమ్యూనరేషన్‌ను పవన్ కళ్యాణ్‌కు ఆఫర్ చేశారని చెప్పారు. అయితే ఆరోగ్యానికి హానికరమైన లేదా చిన్నపిల్లలకు మంచిది కాని ఉత్పత్తులకు ప్రచారం చేయడం ఇష్టం లేక ఆయన కొన్ని కోట్ల రూపాయల యాడ్స్‌ను తిరస్కరించారని వెల్లడించారు. ఇక సినిమాలో సాంగ్స్, డాన్స్, డైలాగ్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ అన్నీ ఉంటాయి. 2 గంటల 35 నిమిషాల సినిమాలో దాదాపు 2 గంటలు పవన్ కళ్యాణ్‌ను తృప్తిగా చూస్తారు' అని హరీష్ శంకర్ నమ్మకం వ్యక్తం చేశారు.

# పోలీస్ అధికారి సునీల్ కుమార్‌కు చుక్కెదురు

**- సస్పెన్షన్ పొడిగించిన ప్రభుత్వం**



**అమరావతి,ఫిబ్రవరి23( వెలుతురు):**
సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం జూన్ 30వరకూ పొడిగించింది. ఆయనపై ఉన్న కేసుల దృష్ట్యా పదవీవిరమణ వరకు ఇక విధుల్లో చేరే అవకాశం లేకుండా పోయింది. ఈ నెల 24 నాటికి ఆయన సస్పెన్షన్ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో 18న భేటీ అయిన రివ్యూ కమిటీ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంతో పాటు అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుల్లో సునీల్ కుమార్‌పై విచారణ కొనసాగుతోంది. వీటితో పాటు ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణ చర్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన వ్యాఖ్యలు చేసిన అంశంపై విచారణాధికారి తన నివేదికను సమర్పించాల్సి ఉంది.ప్రస్తుతం నాలుగు కేసుల్లో ఆయనపై విచారణ జరుగుతున్నందున సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా రివ్యూ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌ను తొలగించడం సబబు కాదని ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆయనపై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకూ లేదా పదవీ విరమణల్లో ఏది ముందైతే అప్పటి వరకూ సస్పెన్షన్‌లో కొనసాగించాలని కమిటీ చేసిన సిఫారసులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న ఆభియోగాలపై సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం తొలుత 2025 మార్చి 2న సస్పెండ్ చేసింది. అప్పటి నుంచీ ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు.

# కనీస వేతనలు 26వేలకు పెంచాలి


**- చీపురుపల్లిలోలో అంగన్‌వాడీల ఆందోళన**

**చీపురుపల్లి,ఫిబ్రవరి23( వెలుతురు):**
తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు ఆధ్వర్యంలో చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అంబాల గౌరి నాయుడు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టీ మాలతి, నాగమణి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా అంగన్వాడీలను ఇబ్బందులు గురిచేస్తుందని వారు అన్నారు. ఫిబ్రవరి నుండి జరిగే బడ్జెట్ సమావేశాలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని మిగిలిన మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లను క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంట్రల్ గా మార్చాలని వారు కోరారు. గ్రాట్యూటీ అమలకు గ్లడైన్స్ రూపొందించి వేతనముతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్ మరియు రూరల్ అనే తేడా లేకుండా అందరికీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

హెల్పర్ల ప్రమోషన్లు నిర్దిష్టమైన గ్లడైన్స్ రూపొందించి అమలు చేయాలని అలాగే పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వాడు ప్రభుత్వాన్ని కోరారు. మే నెల అంతా వేసవి సెలవుల జీవో ప్రకటించాలని కోరారు. వీటితోపాటు లబ్దిదారులకు బియ్యం ఆయిల్ కందిపప్పు లకు సంబంధించి క్వాంటిటీ పెంచాలని మెనూ చార్జీలు పెంచడంతోపాటు ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు అంతేకాకుండా ప్రీస్కూల్ బలోపేతం చేయాలని ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందన పథకాన్ని అమలు చేయాలని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడి సెంటర్ లో ఉండాలని జీవో ఇవ్వాలని వర్కోరారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకుంటే తాము ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు**
**- గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు**




**అమరావతి,ఫిబ్రవరి23( వెలుతురు):**
రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు, రెండో సంవత్సరం అన్ని సబ్జెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్థులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్థులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్థులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విజయనగరం,ఫిబ్రవరి23( వెలుతురు):**
జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కె.ఎల్. పురంలోని శ్రీ లక్ష్మీగణపతి జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదులను సందర్శించి, వారికి కల్పించిన వసతులపై అధికారులను ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎక్కడా అవకాశం లేకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**- ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత**
**- కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23( వెలుతురు):**
మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

# జిల్లా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

**- మాజీమంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్‌ల భేటీ**
**- బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి వాయిదా**



**ఆదిలాబాద్,ఫిబ్రవరి23( వెలుతురు):**
ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని, జైలులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 14 మంది గెలిచినా మంత్రి వివేక్ అధికార దౌర్జన్యంతో ఎన్నికలను నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి బీఆర్ఎస్ నాయకులపైనే కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. సుమన్ పై ఉన్న పాత కేసులు తోడి బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకుంటామని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. జైలులో అధికారులు సుమన్‌ను మానసిక శోభకు గురి చేస్తున్నారని, దోమలు బాగా ఉన్న పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తెలిపారు. కొంత అనారోగ్యానికి గురైన వైద్యం అందించడం లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఇదిలావుంటే రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్ పై వాదనలను కోర్టు నేటికి వాయిదా వేసింది. జిల్లా జైలులో ఉన్న బాల్కసుమన్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణకు రాగా కోర్టు పరిశీలించింది.కౌంటర్ పిటిషన్ పై గడువు కావాలని పోలీసులు కోరగా బెయిలు పిటిషన్ పై వాదనలను రేపటికి వాయిదా వేసింది. జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించింది. పోలీసులను, ప్రభుత్వాన్ని నిలదీసిన బాల్కసుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది . గత వారం రోజులకు పైగా సుమన్ మంచిర్యాల జిల్లా జైలులో ఉన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు బంద్ నిర్వహించాయి .

# రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

**- మున్సిపల్ ఎన్నికలల్లో డ్రామా నడిపించారు**
**- డ్రామాలతో కాలం గడుపుతున్న సిఎం రేవంత్**
**- మండిపడ్డ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్**



**హైదరాబాద్,ఫిబ్రవరి23( వెలుతురు):**
సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు మొత్తాన్ని ఒక డ్రామా నడిపించారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క రోజూ మున్సిపాలిటీల అభివృద్ధి గురించి చెప్పలేదని సంజయ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న వ్యక్తిగా, ఒక డాక్టర్‌గా, రాజ్యాంగాన్ని నమ్ముకున్న వ్యక్తిగా అన్ని వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ముందు మా నాయకుడు హరీశ్‌రావు సిట్ పేరుతో నోటీసులు ఇచ్చి మొదటి డ్రామాకు తెరలేపారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమైనా ఉందా అంటే మన్ను లేదు మశానం లేదని అన్నారు. దావోస్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విహార యాత్రకు చేశాడని.. మొత్తం 12 రోజుల పాటు వెళ్లిన ముఖ్యమంత్రి , దావోసు నుండి తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు గురించి చెప్పలేదని పేర్కొన్నారు. పెట్టుబడులపై మంత్రి శ్రీధర్ బాబు అయినా మాట్లాడతాడని అనుకుంటే ఆయన కూడా మాట్లాడలేదని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను విహార యాత్ర అంటున్నామని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తెలంగాణ జాతిపిత అయిన కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులిచ్చి రెండో డ్రామాకు తెరలేపారని సంజయ్ మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చడంలో రేవంత్ రెడ్డి ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నప్పుడు మున్సిపాలిటీల్లో సభలు నిర్వహిస్తాడని.. మున్సిపల్ ఎన్నికలు ఉన్నప్పుడు గ్రామ పంచాయతీలో సభలు నిర్వహిస్తాడని చెప్పారు. ఏదో ఒక రకంగా ప్రజలను రేవంత్ రెడ్డి మభ్య పెడుతున్నాడని మండిపడ్డారు. ఇతర పార్టీలతో అంటకాగేది రేవంత్ రెడ్డి అని.. కానీ బీఆర్ఎస్‌కు బీజేపీకి లింక్ పెడుతున్నారని విమర్శించారు. వీణా వాణి గురించి నీచంగా మాట్లాడిన వ్యక్తి రేవంత్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రానికి ముమ్మాటికి జాతిపిత కేసీఆరే అని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని.. తగిన సమయంలో రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమని సంజయ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసే వరకు కేసీఆర్ ను తిట్టడం తప్పా, అభివృద్ధి గురించి మాట్లాడడం లేదని తెలిపారు. తప్పులు చేస్తే చెప్పండి అని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, ప్రతిరోజు తప్పులు చేస్తూనే ఉన్నాడని పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి సమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో నిజాయితీగా ప్రజల సమస్యల పై చర్చ చేయాలన్నారు. ఈ బడ్జెట్ లో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇస్తామని చెప్పిన హామీలకు నిధులు కేటాయించకపోతే వారందరూ కలిసి కాంగ్రెస్‌కుబుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో రేవంత్ రెడ్డికి ఫేవరేట్ సబ్జెక్ట్ అయిన రియల్ ఎస్టేట్ గురించి మాట్లాడుదామని తెలిపారు. సమావేశాలకు వచ్చే ముందు దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలుసుంటే బావుంటుందని రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఎట్టకేలకు దేవాదుల ప్రాజెక్టు దగ్గరకు వెళ్లినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు శ్రీరామ రక్ష అని రేవంత్ రెడ్డికి తెలుసు అని సంజయ్ అన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాల్సిందేనని తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో మాకు మైక్ ఇవ్వమని చెప్పండి, జలాల పై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజిని లాంటి వాడు, ఆయన చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని విమర్శించారు. ఈసారి అయిన అసెంబ్లీని గౌరవించి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు. పార్టీ మారారని ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌పై అనర్హత వేటు వేశారని సంజయ్ తెలిపారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా స్పీకర్ వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ కు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రచారం చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు.

## కలుషిత ఆహారం పెట్టారంటూ విద్యార్థుల ఆందోళన



**హైదరాబాద్,ఫిబ్రవరి23( వెలుతురు):**
రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలల పరిస్థితితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. నాణ్యత లేని, కలుషిత ఆహారం పెడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచుగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలతో వందలాది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారు. ఇటీవలే నాగర్‌కర్నూల్ సంఘటన మరవకముందే జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడురు గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. కలుషిత ఆహారం పెడుతున్నారని ఆరోపిస్తూ తరగతులు బహిష్కరించి రోడ్డెక్కారు. మంచి ఆహారం పెట్టి, కనీస వసతులు కల్పించాలని, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com